# గబ్బిలము

నవయుగ కవిచక్రవర్తి
జి. జాషువ

ప్రతులకు:
హేమలతాలవణం
పటమట, విజయవాడ-520006

GABBILAMU

by JASHUVA

Copyright dy

Hemlata Lavanam

Vijayawada - 520 006

పునర్ముద్రణ

మార్చి 1987

వెల : రు. 10 00

INSAAN PRINTERS

Benz Centre,

Vijayawada - 520 006

# విజ్ఞప్తి

సహృదయులారా!

కాళిదాసుని మేఘసందేశము మనస్సులో నుంచుకొని నే నీ కావ్యమును రచించితిని. గ్రంథనామము గబ్బిలము. శ్రోతల కిది కటువుగా దోచవచ్చును. కానీ అందలి కథానాయకుడు ప్రణయ సందేశము నంపును. ఇతడంపునది తుకతుకనుడుకు నశ్రుసందేశము. అతని శిక్షాకాలపరిమితి యొక సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము. తరతరములు. దీని కవధి లేదు. అతడు మన్మథాగ్నితప్తుడు, ఇతడు క్షుధాగ్ని పీడితుడు.

'నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్రహృదయంబు గూడ కొంతవసరంబు'

అని యితడు వాపోవును. కులీనులగు రాజులకువలె హంసలు, చిలకలు మున్నగు నుత్తమపక్షిదూతలితనికి జిక్కుట అసంభవము. కావున నిట్టిడుల జీర్ణకుటీరములలో నిరంతరము దర్శనమిచ్చు గబ్బిలము నితనికి సందేశహారిగా బరిగ్రహించితిని. రసజ్ఞుల కిందలి యౌచితి సులభగ్రాహ్యము. ఇంట ప్రవేశించి దీపమార్పిన గబ్బిలమును జూచి తన కన్నీటి కథ నీశ్వరునితో చెప్పుమని వీడుప్రార్థించెగాని నిజమున కతని యుద్దేశ్యము దేశారాధన. కైలాసయానమునకు నాపన్నిన త్రోవకొంత వక్రతకు

గుతియైనది. ఇది దోషము కాదనుకొందును. ఈ కృతి రసజ్ఞలోకా దరణ నందిన నాశ్రమ ఫలోన్ముఖము కాగలదు.

నేనీ గ్రంథమును ముగించు నవసరమున గుంటూరు జిల్లా బోర్డు ప్రసిడెంటుగారును, దేశభక్తులును, కళాభిమానులు నగు శ్రీ కల్లూరి చంద్రమౌళి చౌదరిగారు మా యూరు దయచేసి గ్రంథము నామూలాగ్రముగా విని పతిత్వము వహించుట కంగీ కరించుట నాయదృష్టము. వారికి నా నమస్కారములు. వారికి నేను కృతజ్ఞుడను.

గ్రంథకర్త.

"గబ్బిలము" తొలి ముద్రణకు శ్రీ హనుమంతరావుగారు వేసిన
వర్ణచిత్రమునకు శ్రీ కంచర్ల పాండురంగశర్మ
తెలుపు - నలుపు చిత్రం.

# గబ్బిలము

( మొదటి భాగము )

# గబ్బిలము

చిక్కినకాసుచేఁ దనివిఁ జెందు నమాయకుఁ డెల్ల కష్టముల్.
బొక్కెడు బువ్వతో మఱచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులుఁ గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కఁడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డఁడై

పూపవయస్సులో వలసవోయిన చక్కని తెల్గు కైతకున్
ప్రాపక మిచ్చినట్టి రఘునాధనృపాలకుఁ డేలియున్న తం
జాపురి మండలంబునకుఁ జక్కగ దక్షిణభాగ భూములన్
గాపురముండె నప్పురమ గర్భదరిద్రుఁడు నీతిమంతుడై.

ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
బిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగాఁ
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్.

వాని ఱెక్కల కష్టంబు లేనినాఁడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తి లేదు

2)

వాని తలఁమీద బులిమిన పంకిలమును
గడిగి కరుణింపలేదయ్యె గగనగంగ
వాని నైవేద్యమున నంటు వడిన వాఁడు
మూఁడు మూర్తులకును గూడఁ గూడు లేదు.

పామునకుఁ బాలు, చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిం జనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకుఁ గూడ
నులికిపడు జబ్బు గలదు వీఁడున్న చోట.

వాని నుద్ధరించు భగవంతుఁడే లేఁడు
మనుజుఁ డెట్లు వానిఁ గనికరించు
వాఁడు జేసికొన్న పాపకారణ మేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరి బుసకొట్టు నాతని గాలిసోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు.

కులములేని నేను కొడుకులఁ బుట్టించి
యీ యఖాతమందె త్రోయవలెనె
భార్యయేలఁ బుట్టుబానిసకని వాఁడు
జరుపసాఁగె బ్రహ్మచర్య దీక్ష.

ఉదయమాది రక్త మోడ్చికష్టముఁజేసి
యినుని సాగనంపి యిల్లు సేరి
యున్న గంజిఁద్రావి యొక్కనాఁడాపేద
ప్రక్కమీఁద మేను వాల్చియుండె

భూ నభములఁ గ్రొంజీఁకటు
లేమఁగునకు మదము వోలి యెసక మెసఁగె సం
ధ్యా నాట్య కేళి మాని మ
హానటుఁడు శివారవముల నారంభించెన్.

ముక్కు మొగమున్న చీఁకటి ముద్దవోలె
విహరణము సేయసాఁగె గబ్బిల మొకండు
దాని పక్షానిలంబున వాని చిన్ని
యాముదపు దీప మల్లన నాఱిపోయె.

తిల్లిక నాఱిపి దయ్యపుఁ
బిల్లవలెం దిరుగుఁదబిసి పిట్ట నరయఁగాఁ
బల్లవితమయ్యె నాతని
యుల్లంబునఁ గ్రొత్త క్రొత్త యూహాంకురముల్.

చెలిమిన్ బక్షికి విన్నవించుకొనఁజొచ్చెన్ స్వీయవృత్తాంతము
మ్మలికన్ గందిన నెమ్మనంబున మదోన్మత్త ప్రపంచంబులోఁ
బులుఁగుంబుట్టలుఁగాఁకఁ బేదలకు నాప్తుల్ జుట్టపక్కంబులు
న్గలి రేవానికవోష్ట బాష్పములు వాఖ్యానించెఁ జక్రాంగవల్.

ప్రవిమల దేవతాభవన వాసముచేయుచు మమ్ము వంటి మా
నవులకు లేని గౌరవమునం దులదూఁగెడు గబ్బిలాల రా
జివిగద నీవు స్వాగతము నీకు శుభంబకదమ్మ నీతనూ
భవులకుఁ దల్లక్రిందుల తపంబులకున్ గుడి గోపురాలకున్.

గాఢనిద్రావలంబియై కన్నుమూసి
క్ష్మాతలము మేను మఱచిన కాళరాత్రి
నాగృహంబున వెదుకుచున్నా వదేమి
దొరక దిచ్చట నానంద కిరణ లవము.

నిన్ను బహిష్కరించు నవనీవలయం బిది యంటరాని వాఁ
డున్న నిషిద్ధగేహము సహోదరి నీవు సమస్త దేవతా
సన్నిధి నారగింతువు ప్రసాదము లంతటి పుణ్యురాలివై
యన్నములేని పేదల గృహంబులు సొచ్చితివేల జేలవై.

హృదయములేని లోకముసుమీ యిది మాపులఁ బశ్చిమంబుగా
నుదయము తూర్పుగా నడచుచుండు సనాతనధర్మ ధేనువుల్
పిదికిన పాలు పేదకు లభింపవు శ్రీగలవాని యాజ్ఞలోఁ
బెదవిఁ గదల్పఁజాల రరవిందభవ ప్రముఖామృతాంధసుల్

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుఁగాని దుః
ఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరత మేదిని ముప్పదిమూఁడుకోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తు లాఱునే.

పరమార్థంబులు బోధసేయుదురు లోభస్వాంతులై నిత్యమున్
గురువుల్ ముక్కుకుసూటిగాఁదగులు యుక్తుల్ పన్ని కైవల్యపుం
దెరువుల్ మాపి మహాపరాధివనుచున్ దీర్మానముల్ సేయుచుం
దురు వేదాంతరథంబు సాగదనుకొందున్ నేను లేకుండినన్.

ఒగసంసారము దిద్దుకొంచుఁ గర మత్యుచ్చస్థితిం దూఁగుచుం
బగలెల్లన్ మునివృత్తినుండి యనుకంపన్ శర్వరీ వేళలన్
వగలందూలు దరిద్రమూర్తుల సమాశ్వాసింప నేతించితే
ఖగసన్యాసిని! యర్హురాల వకలంకంబైన మర్యాదకున్.

గిరుల గుండెలు కరిఁగి నిర్ఝరములట్టు
లుబుకుచున్నవి దిశల నన్మాఱడింప
బక్షికళ్యాణి! సోదర ప్రజలకండ్ల
నిర్గమించెనె యొక్క కన్నీటిచుక్క.

చుట్టాలేగద వాలఖిల్యు లిన తేజుల్ యోగవిద్యానిధుల్
పుట్టుందాపసు లార్ద్రచిత్తులు మహాత్ముల్ పైన తేయస్తుతిన్
జెట్టుం గొమ్మఁ బరిత్యజించిన పరశ్రేయశ్శుభాకాంక్షు లో
పిట్టా! నీకు నమస్కరించెదను నా విజ్ఞప్తి నాలింపవే.

ఈ ప్రశాంతరాత్రి యెల్లలోకంబును
బుజ్జగించి నిద్రఁ బుచ్చుకొనియె
నౌషధంబులేని యస్పృశ్యతాజాడ్య
మందభాగ్యు నన్ను మఱచిపోయె.

కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నాభక్తి ననుభవింత్రు
కర్మమన నేమొ దానికి కక్ష యేమొ
యీశ్వరునిచేత ఋజువు చేయింపవమ్మ.

ఆలయంబున నీవు వ్రేలాడువేళ
శివుని చెవి నీకుఁ గొంత చేరువుగ నుండు
మౌని ఖగరాజ్ఞి! పూజారి లేనివేళ
విన్నవింపుము నాదు జీవిత చరిత్ర.

ఆపూజారులు విన్న నీకగును ప్రాయశ్చిత్త మీశానుఁడున్
గోపించున్ వివరింప నేమిటికి నీకుం బొమ్ము వార్ధక్యమున్
దాపై పెంజెడ దెల్లసైనది నిశీథస్త్రీకి నాఖేటక
వ్యాపారంబు ముగించి నీపొరుగు గూబల్గూండ్లకున్ బోయెదిన్.

వసమించు నీ గరుత్తుల
విసరి శ్రమంబడపి నన్నుఁ బ్రేమించిన నీ
యసమోప కారమునకుం
బసదన మిడలేక నే ఋణస్థుఁడ నైతిన్.

నీ నమస్కారముల నిక్కి నిక్కి నడవఁ
బక్షిణీ నాకు నుద్యోగబలము లేదు
మెచ్చఁదగు నీ కళాశక్తి నుచ్చరింప
ఖగసతీ! నాకుఁ గులము యోగ్యతలు లేవు.

స్వార్థమున నిన్నుఁ గొఱముట్టువలె గణింపఁ
గడుపునిండిన భాగ్యవంతుఁడను గాను
దోషములు సూపి నీకు నీతులు వచించి
దొరతనము సేయఁగా మతస్థుఁడను గాను.

మృగపక్షిత్వ విచిత్రధర్మములు మూర్తిన్ దాల్చియున్నది నీ
మొగముం జూడదు లోక మట్టి శకునంబుల్ ప్రాతపట్టింపులు
న్దగవీ పేదకు రమ్ము గబ్బిలపుచానా నాదు స్వాంతంబులో
దిగులుంబాపి పినాకపాణి కొక సందేశంబు నందింతువా.

ధర్మమునకుఁ బిరికితన మెన్నఁడును లేదు
సత్యవాక్యమునకుఁ జావు లేదు
వెఱవనేల నీకు విశ్వనాథుని మ్రోల
సృష్టికర్త తాను సృష్టి వీవు.

నరునకుఁ జేరరాని సదనంబున వాసము సేయు నీశ్వరే
శ్వరునకు నానమస్కృతు లుపాయనమిమ్మొకవేళఁ గారడాం
తరముల వెండి పర్వతమున న్నివసించుచు నున్నఁ బక్షిసుం
దరి యొకపూట యానమకదా యిది నీకుఁ బరోపకారిణీ.

గౌరీనాథుఁడు కాశికిం జనెడు మార్గంబందు రా మేఘపుం
జాఱిన్ జుక్కలతోఁట నాటుకొని మింటన్నీకుఁ గన్పట్టు నా
దారిం బొమ్మొకవేళఁ జూచెదవు భూతస్వామిని న్నీకుఁ జ
త్వారం బేర్పడి దారిఁ దప్పెదవుగాదా భానుఁడేతెంచినన్.

ఛత్రములవంటి నీలి పక్షములు విచ్చి
నీవు బ్రహ్మాండమునఁ బయనించు వేళఁ
జిత్రజల్లుల ముమ్మాయి ముత్తియములు
జలధరస్వామి నీమీఁదఁ జల్లఁగలఁడు.

మొలక సంధ్యారాగమునఁ గెంపు లెగఁ జిమ్మఁ
    జరమాచలంబునఁ జరణమూఁది
సెలయేటి నీట నీతఁలు గొట్టి విహరించు
    మరుదంకురముల సన్మానమంది

కొండకొమ్ముల నెదుర్కొని తుత్తునియలైన
    తోయదమ్ముల మీఁదఁ దుఱఁగలించి
కలహంస పొదిగి పిల్లలుసేయు మిన్నేటి
జాంగలంబుల మీఁద సంచరించి

చిలుక లెంగిలింపఁ జిటిలి తేనియలూరు
స్వాదుఫలము లెలమి నారగించి
కొన్నినాళ్ళపాటు కుటిల సంసారంబు
దిగులు మఱచి రమ్ము ఖగ వధూటి.

సాత్వికాహారిణీ తపశ్చర్య కతన
నీ మనంబున జాలివెన్నెల రహించు
నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్రహృదయంబుఁ గూడఁ గొంతవసరంబు.

బిడ్డల గని పాలిచ్చెడు
దొడ్డతనంబున్న పుల్గు దొరసానివి నా
కడ్డుపడ దిగిన వేలుపు
గిడ్డివి నా మనవి నాలకించెదవు గదా.

నీయౌదార్యగుణంబు మెచ్చెదరు సందేహంబు లేకుండగా
నాయుష్మంతులు నీ కుమారులు మగండంగీకృతిం జూపి నీ
వాయెత్తైన నగంబు కొమ్మల విహాయస్కేశు నావాసమం
చూయేలూగి కృతార్థురాలవయి రమ్మో పుల్గు పుణ్యాంగనా!

పక్షిసుందరి నీ చిన్ని కుక్షి నిండ
నిన్ని నీరంబుఁ బలహార మున్నఁ జాలు
నెన్ని దేశాలు తిరిగిన నేమి నీకు
నీవు నావలెఁ బుట్టుబానిసవు కావు.

తడవైనన్ గుడి గోపురంబులను సందర్శించుచుం బొమ్ము నీ
కడవుల్ కొండలు నడ్డుసేయవుగదమ్మా వ్యోమయానంబునన్
సుడిగాల్పు ల్సెలరేఁగినన్ నిలువవచ్చుం ధర్మ సత్రాలలోఁ
బిడుగుల్ వడ్డఁ బ్రవేశయోగ్యతలు పాపిన్నాకు లేవచ్చటన్.

అందందు ఫలవనంబుల
విందుగుడుచు చల్లనల్ల విశ్రామ మణీ
మందిరముల నిద్రించుచు
ముందుకుఁ జనఁదోఁచు నెన్నొ పుణ్యస్థలముల్.

కొమరారు దంజనగరము
సమీపమునఁ గలదు తెలుగు సౌరభ్యంబుల్
గమగమ వలచిన చోటది
యమరున్ రఘునాథరాజు నాస్థానంబునన్.

కృష్ణరాయులవారి యెడఁబాటు చీకట్లు
ముసరి దిక్కులలోన మసలువేళ
భూరి వాఙ్మయలక్ష్మి దారిబత్తె ముతోడఁ
దంజాపురమువంకఁదరలువేళఁ
వేంకటకవి తెల్గు పంకేరుహాక్షికి
శ్లేషోక్తు లలవాటు సేయువేళఁ
బచ్చ పచ్చని ముద్దుపళని ముద్దులకైత
శృంగార రసము వర్షించువేళ

మువ్వగోపాల దేవుని పూజసేయ
ఘనుఁడు క్షేత్రయ కలమందుకొనినవేళ
నపరరాయలు రఘునాథ నృపతి విధుఁడు
కట్టుకొన్నాఁడు సత్కీర్తి కుట్టిమంబు.

తనువుప్పొంగ సరస్వతీమహలు సందర్శించి తంజాపురీ
మనుజాధీశుల యోలగంబును పరామర్శించి పొమ్ముత్తరం
బునకున్ ద్రావిడభూములం గడచి పోబోదోచెడిన్ వాఁడువా
అని శౌర్యంబుసుమించుఁ దెల్గు పొలిమేరల్ నేత్రపర్వంబుగన్

యతియుం బ్రాసయులేని సంస్కృత కవిత్వారణ్యమందున్న భా
రతవేదానఁ బదేనుపర్వముల కాంధ్రీత్వంబు నేర్పించి శా
శ్వతుఁడై పోయిన తిక్కయజ్వకు నివాసంబైన నెల్లూరికిన్
నతులర్పింపుము స్నానమాడు మతి గణ్యంబైన పెన్నానదిన్

ఒకపల్కు జాణతనమున
సకియలు నెల్లూరుసీమ సత్కవి వరులం
దికమకలు పెట్టఁగలరని
పుకారు గల దది యబద్ధమో నిక్కువమో.

హంపీక్షేత్రముఁ జూచి పోవలయు నమ్మా తెల్గురాజ్యంపు సై
లింప శ్రీల కొకానొకప్పుడది కేళీరంగ మేతద్రమా
శంపావల్లరు లాఁటిపోయిన ప్రదేశంబందు నీ బందుగుల్
కొంపల్గట్టి నివాస ముండెదురు నీకుం గూరు రానందమున్.

పరదాపద్ధతి మాన్పిరో సిరికిఁ గుప్పల్ వోసి యంగళ్ళ యం
దురుమాణిక్యము లమ్మినారచట మున్నోపక్షిణీ మూరురా
యరగండండు మహేంద్ర వైభవముతో నాంధ్రక్షమామండలి
న్బరిపాలించిన నాఁటి పెంపును దలంపన్ మేను గంపించెడిన్.

పగతు రసూయచేతఁ గరవాలములన్ దనువెల్లఁ జెండినన్
జిగిరిచియున్న యుగ్రనరసింహుని భీమదృగంచలంబులన్
బొగ ఝడివోవలే దతని మ్రోల నిమేషము నిల్వజాలినన్
ఖగసతి నిన్ను ధైర్యవతిఁగా గణియింతురు వీరయోధులున్.

ఏనికవంటి సానువు గణేశుని నున్నని బొజ్జమీద గా
లూనఁగ లేదు తుమ్మెద తదుజ్జ్వలశిల్ప మఖండ తుంగభ
ద్రానది కప్పగించుకొని దగ్ధమలైన తెలుంగువారి వి
ద్యానగరాన జిందు మొక యశ్రుకణంబు నుపాయనంబుగన్.

సరసుఁడు కృష్ణ భూవిభుఁడు స్వారియొనర్చిన పారసీహుమా
దొరల ఖురాగ్రహల్యలను దున్నిన భూములలోన నాంధ్రసుం
దరు లొకనాఁడు నాటుకొనినారు దిగంత జయప్రరోహముల్
గరిసెల నించినా రురువుగా ఫలియించిన సుప్రతిష్ఠలన్.

మూరురాయరగండఁ డూరేగ డీనాఁడు
విద్యానగర రాజవీథులందు
మేలైన పట్టుడేరా లెత్తరీనాఁడు
పారసీక గుఱాల బేరగాండ్రు
ఇనుపరోకళ్ళ సాధన సేయవీనాఁడు
కొమ్ము నిక్కిన భద్రకుంజరములు
తెలుఁగు స్కంధావారముల నిండదీనాఁడు
మరఫిరంగుల తెల్లదొరల దండు

మణిమయంబైన యాంధ్రసామ్రాజ్య రథము
భువికిఁ గ్రుంగిన పదియునాఱవ శతాబ్దిఁ
గృష్ణవిభు వీటఁ బొద్దు గ్రుంకినది మొదలు
ఋషిఖగాంగన తెల్లవారినది లేదు.

కంచర్ల శ్రీకృష్ణ గంధర్వుఁ డేలిన
నగరంబు దున్నించి నారు వోసి
వినుకొండ విభుని రాయని భాస్కరుని కోట
బురుజులూపున నేలకొఱగఁదన్ని
పల్నాటిదొరల శుంభత్ప్రతాపజ్వాల
సాటి కెక్కని నాగు లేటఁ గలిపి
వినుతిఁ గాంచిన కొండవీటి సామ్రాజ్యంబు
నుక్కుకత్తుల బావి కొప్పగించి

యుడుకు నెత్తుటఁ జేతులు గడిగికొన్న
కాలపురుషుని పెను దుండగములు దలఁచి
మనసు నలిగిన గుంటూరు మండలంబు
నరసి పోవమ్మ జన్మ ధన్యత వహింప

ప్రొద్దునకు వన్నెఁ బెట్టిన
యిద్దఱు భాస్కరులు పుడమి నేలఁగ సొగసుల్
దిద్దినది మేన వయసునఁ
బెద్దది గుంటూరు సీమ పెఱ సీమలలో.

ఖరుచైపోయెఁ దెలుంగు రక్తమతిలోక స్వచ్ఛశౌర్యంబు సో
దరి వ్యర్థంబగు కోడిపందెపు తగాదాలందుఁ బల్నాటిలో
నరుదారన్మఱిలె న్వినోదముగఁ గార్యంపూడి తిర్నాళ్ళ త
త్కరవాలంబులు త్రుప్పుపట్టి యిపుడున్ గల్పించు నారాటమున్.

కృతులంది కృతు లొసంగిన
వితరణ రతులైన కొండవీటి నృపుల యు
న్నతియుం బతనం బిప్పుడు
కృతులై కొండల నలంకరించి జితించెన్.

విసిగి విరక్తిచేఁ దెలుఁగు వీధులలో నొక పిచ్చివానిగా
మసలిన రెడ్డిరాజు మునిమాన్యుఁడు వేమన యాశుధారగా
విసరిన కావ్యముల్ శ్రవణ పేయముగాఁ బ్రతిశబ్దఁ మీనెడిన్
దెసల నలంతి పోలికలఁ దీయఁదనంబున భావసంపదన్.

జలదవ్రాతము తోఁడుగా యవలఁ గృష్ణాతీర దివ్యస్థలుల్
గలయంగ్రుమ్మరీ సాగిపొమ్ము కవిలోకబ్రహ్మ నన్నయ్యకున్
నిలయంబై తగు రాజమహేంద్ర పురికిన్ విద్వత్సభారంజిత
స్థలికిన్ బూర్వచళుక్యభూపతుల రత్నస్థాపితాస్థానికిన్.

ఎచ్చటఁ జూచినన్ బ్రతిపదించు కళంబలెఁ బచ్చపచ్చగా
రచ్చలకెక్కు గన్నడ సరస్వతి నారసి మానసంబులో
మచ్చరకించి నన్నకవిమాన్యుఁడు రాజమహేంద్రునానఁ దా
నిచ్చటఁ జేయిజేసికొనియన్ బ్రథమాంధ్రకవిత్వ సృష్టికిన్.

రెండున్నర పర్వంబులు
పిండిన రస మొలుకునట్టి పెను జెఱకుగడన్
బాండవుల చరిత నన్నయ
పండించెన్ దెలుఁగులోనఁ బ్రజ్ఞాన్వితుఁడై.

జనవిభుండైన విష్ణువర్ధనుని నాఁటి
గౌతమీగంగ నీకు స్వాగత మొసంగు
వీరమాగాణముల నుద్భవిల్లునట్టి
గటికపోచయు నాకర్షకమ కదమ్మ

తొలి సారంగధరుండు వట్టి యపవాదు న్మోత్తి పైఁదాల్ప క
త్తులపాలైన విషాదగాథ వినలేదో నీవు చిత్రాంగి మే
డలలో మూలుగుచున్న విప్పటికిఁగూడ న్మావురాల్ నీతికిన్
బలియైపోయిన రాజనందనుని దౌర్భాగ్యంబు నూహింపుచున్

అజ్ఞాయింతువొ చుట్టుమార్గమని ద్రాక్షారామ భీమేశ్వరుం
డుజ్జీలేని దయాస్వభావుఁడు ప్రభావోల్లాసి ముప్పొద్దులన్
గజ్జంగట్టెడి నాట్యగాఁడతఁడు సాక్షాత్కారమున్ జెందినన్
మజ్జాత్యుద్ధరణంబుఁగల్గఁ గలదమ్మా పొమ్ము సేవింపఁగన్

నిద్దంపు లేఁత కస్తురి
ముద్దవనుచు నిన్నుఁజూచి ముచ్చటపడి రా
ముద్దియలు ముచ్చటించెద
రొద్దిక శ్రీనాథకవి బహూకరణముగన్.

అరవింద రత్న మండిత
తరంగరథ మెక్కి విభుని దర్శనముకై
పరువెత్తుచున్న గోదా
వరితోడుగఁ బొమ్ము దక్షవాటి నగరికిన్

అమృతమ్ము విషము వాక్కున
నమరిన కవిరాక్షసునకు నావాసం బై
కొమరారు నవరకాశిక
సుమి కడు మహిమాఢ్యమైన చోటది పతగీ.

అల బుస్సీ దొర కొల్లగొట్టిన యనన్యంబైన మావెల్మవీ
రుల విఖ్యాతపరాక్రమజ్వలన మూర్పుల్ జిమ్ముచున్నట్టి బొ
బ్బిలి కోటం గని దాటిపొమ్ము చటులావేశంబు దేహంబునన్
మొలచున్ బొల్చు కవోష్ణవీర రుధిరంబున్ జీవనాళంబులన్.

నాయెడ జాలిలేక చరణంబునఁ గత్తులు గట్టి ప్రాణముల్
దీయఁదొడంగు రాజవితతిం జలవార్చితిఁ దెల్లవారునే
నాయులివాలకింపని యనంత విభావరులంచుఁగొక్కురో
కోయని కూయుచున్న దదిగో తొలికోడి బడాయికొట్టుచున్.

పూసపాటివారి ముఖ్యపట్టణమైన
విజయనగరమందు విశ్రమించి
జగము దద్దరిల్ల సకిలించినది తొల్లి
రాయరావు తుల గుఱాలదండు

కరవాలంబునఁ గొల్చి రాయలు పరిష్కారంబు గావించుచున్
సరిహద్దుల్ సవరించినాఁడటు లొరిస్సాదాఁకా ఆరాజభా
స్కరుఁడెత్తించిన బొట్టునూరి విజయస్తంభు పై వేలుపుం
దెఱవల్ నిల్చి పఠింతు రాంధ్రులవిభూతిన్ ముక్తకంఠంబులన్

నీవు బొబ్బిలి మీఁదుగా నిర్గమించి
మన్యము తరించి కొన్ని యామడలు నడువ
పలుచఁబడిపోవు మన జిల్గు తెల్గు శోభ
తావు లెగజిమ్ము నోఢ్ర వాతావరణము.

తేటయైన తీపినీట దిక్కులదాఁక
విస్తరించి రుచులు గుస్తరించి
చిల్కసంద్ర మింపుసేయుచుఁ గన్పట్టు
స్వచ్ఛమైన తెల్గు భాష వోలె.

చిట్టి మరుదంకురంబులఁ
బుట్టిన కెరటాల మొత్తములు తీరములన్
గొట్టుకొని మరలి పోవును
గట్టులెగయఁ జూచు చిలిపికవనములవలెన్.

తగులు న్నికట మార్గమధ్యమున బౌద్ధస్తూప శైథిల్యముల్
మగధోర్వీశుల రాణివాసములు లీలాభర్మ హర్మ్యావళుల్
జగముల్మెచ్చిన శాక్యసింహుని యహింసాసూక్తి మాధ్వీకని
మ్నగలం దేలిన పుణ్యభూములు నలందా పాటలీపుత్రముల్.

ముక్తిదంబులైన పుణ్యస్థలములందుఁ
బ్రథమగణ్య మమ్మ వారణాసి
అన్నపూర్ణ సేయు నాహారభిక్షతో
ముక్తిభిక్ష నీకు ముట్టగలదు.

నదుల తోడికోడలు దధీశు పెదభార్య
జాహ్నవీ స్రవంతి జలము దేర
అతిథి పూజసేయ నన్నపూర్ణాదేవి
వారణారిఁ గూడి వారణాసి.

కలరు కళాసముద్రములు గట్టులు రాయగ నీదినట్టి ధీ
విలసితులైన పండితులు పెక్కురు వేదపురాణ శాస్త్రముల్
బలికిన సత్కవీశ్వరుఁడు వ్యాసమునీంద్రుఁడు శిష్యకోటితో
మెలఁగె నొకప్పుడుండు నట మేచక కంఠుఁడు విశ్వనాథుఁడై

మొగలాయి చక్రవర్తుల
మృగాంక కేతనము నింగి మెఱసిన ఢిల్లీ
నగరంబు దృష్టి గోచర
మగు ప్రోన్నత సౌధచుంబితాంబోధరమై

ఆ ఢిల్లీపుర హస్తినాపురి సమాఖ్యన్ ద్వాపరంబందుఁగొం
డాడం బడ్డది ధర్మజుండచట రాజ్యంబేలి చేయించినా
డీడుంజోడును లేని జన్నముల నెన్నేఁ గన్నులున్నందుకున్
జూడన్ దగ్గ పురంబు సుమ్మచట వీచున్ భోగసౌరభ్యముల్

ముడిచె నిచ్చట కుంతి కొడుకు ద్రోవది కొప్పు
పగవాని రుధిరంబు పరిమళింప
మెఱసె నిచ్చోట నాదరుషా కుఠారంబు
నిఖిల భారతము కన్నీరు నింప

వెలసె నిచ్చోట పచ్చల బర్హిపీఠంబు
షాజానురాజునాస్థానవాటి
పెండ్లాడె నిచ్చోట పృథ్వీరాజొక రోజు
జయచంద్రు సుతను దోస్సార గరిమ

యుగయుగాల కథల నుదరాన జీర్ణించి
రాజరక్త నిర్ఝరములఁ దేలి
నవ్వుచున్న ఢిల్లి నగరంబు నందంబు
తరుగులేదు శిరము నెరియ లేదు

సులతాని సులతానులున్ మణిగణాంశుల్ దట్టుమిట్టాడు మే
డలలో వాసము చేసినారు నిజరాష్ట్రంబొకటందూఁబే
దలనోరూర భుజించినారిచట ముక్తారత్న పాత్రంబులన్
గలమాన్నంబు సుఖించినా రఖిల భోగశ్రీ మహాడోలలన్

కుతుబుద్దీనుడు నిల్పిన
కుతుబుమినారనెడు గొప్ప గోపురము సము
న్నతమయ్యుఁ జెక్కు చెదరదు
శతాబ్దములనాఁటి శిల్ప చకచకితంబై

చామనచాయ గలట్టిది
కామజనకు ననుఁగుభార్య కాళింది వినీ
లామల కోమలవీచీ
చామరములు వీచి నీకు స్వాగతమిచ్చున్.

సూనుని కాయిలా తనకుఁ జొప్పడు లాగు నమాజుజేసి య
ల్లానలరించి యాదిమొగలాయి నరేంద్రుఁడు బేబరుండుమా
యూనున కాయురున్నతులు సృష్టియొనర్చిన చిత్రగాథ ఆ
గ్రానగరంబు కర్ణశుభగంబుగ నీకు నుపన్యసించెడిన్.

షాజాసు నశ్రుజలకణ
మీ జగముపురంధ్రి దాల్చు నేడవ నగ ముం
టాజమహలు నిద్రించెడు
తాజమహలు దృశ్యమద్భుతంబు పతంగీ !

కుహనా గోపుం డాగమ
రహస్యమగు గీత బాహిరము చేసిన శ్రీ
మహిత కురుక్షేత్రంబున
విహార మొనరించి పొమ్ము విహగవధూటీ.

సుజనస్తుత్యుఁడు బోధిసత్వధరణీశుండర్ధరాత్రంబునన్
నిజవాసంబుఁ బరిత్యజించి యతిశాంతి స్థాపనేచ్ఛా మనోం
బుజుఁడై బిచ్చఁపుగిన్నెఁ దాల్చిన మహాపుణ్యప్రదేశంబులన్
మజిలీ సేయుము రెండునాళ్ళు ఖగభామా! జన్మసిద్ధించెడిన్.

లుంబినీ వనపరిమళోల్లసిత మగుచు
నేఁగుదెంచెడు నీకర్ఘ్య మీయఁ గలదు.
గౌతముం డాదరించిన కనకహంస
నీరు గలియని మధుర గోక్షీరధార.

దర్శింపగలవు గౌతమబుద్ధదేవుని
ప్రాచీన భరత శిల్పంబునందు
సాధింపఁగల వహింసా మంత్రరాజంబు
శాక్యసింహుని కాలి జాడలయందు

తెలిసికోఁగలవు బౌద్ధుల సాహితీ సేవ
అమరసింహుని కవిత్వమునయందు

వీక్షింపగలవు కపిలవస్తు నగరంబు
నాశన దేవ్యధీనంబు నందు

రెండువేలేండ్లు క్రింద నిద్రించుచున్న
మౌర్యరాజుల విపుల సామ్రాజ్య చరిత
యేకరువు పెట్టుప్రకృతి యందాకళించి
వెచ్చ వెచ్చని కన్నీరు విడువఁగలవు.

అక్కడనుండి యుత్తర దిశాభిముఖంబుగ నిర్గమించు నీ
దృక్కుల నడ్డుచున్ హిమగిరీంద్రము దర్శనమిచ్చు దానిపై
నెక్కఁగనెంచి తెల్లదొర లీలిగిరెందరొ! వారి దేహముల్
స్రుక్కవు నేఁటికిం బులుఁగు సుందరి మంచుమహత్త్వ మెట్టిదో

కరఁగిన మంచు బండలు ప్రగాఢభరంబునఁ బట్టుదప్పి, త
ద్గిరి శిఖరాలనుండి తలక్రిందులుగా దిగజారి లోయలన్
దిరిగెడు జీవరాసుల వధించుచు నుండును పేదవారికిన్
జెలపె కదా! బలాధికుల నేయము సంయమి పక్షి భామినీ!

అందు నెవరెస్టు శిఖరాన నధివసించి
వ్రాసికొనవచ్చు భరత వర్షంబు పటము
దాని యున్నతి తారకాధ్వజము మిగులు
సులలితములైన కవుల యూహలకుఁ దఱుగు.

కలహంసల్ సనువాయుమార్గముల రేఖల్ పర్వతాగ్రంబునన్
గలవాత్రోవల దక్షిణో త్తర దిశాగ్రవ్యాప్తముల్ ప్రోన్నతం
బులు నీకుం జన గాదు నిచ్చలు నిలింపుల్ గుంపులై రాకపో
కలు గావించెడు వెండి కొండ తెరవుల్ గన్పట్టు నైమూలగన్.

విహిత కైలాసయాత్రగావించు నిన్ను
మంచుకొండల విభుఁ డాదరించఁగలఁడు
అల్లునకుఁ గూఁతునకు వార్త లంపునేమొ
సమ్మతింపుము నుడులు భారమ్ముగావు.

అస్త్రవిద్యాభ్యసన వేళ నద్భుతముగ
కొంచకొండకు రంధ్రంబు గొట్టినాఁడు
చినతనంబున బార్వతి చిన్నికొడుకు
తారకాగిరి కదియ యుత్తరపు గవిని.

గిరుల మగవాని చెలిమి వ్యక్తీకరింప
మస్తమునఁదాల్పు మొక చిన్ని మంచుతునక
విసపుమేతరి కది సిఫారసుగ నుండు
వ్యర్థములుగావు పెద్దల పరిచయములు.

మంచుఫలించు నగ్గిరులమాడులఁగాఱు మొయిళ్ళపై నుడా
యించు గమింపు మవ్వల మహేంద్రుని వీడు త్రివిష్టపంబు గ
న్పించు దలాయిలామలను వింత నృపుల్ పరిపాలనంబు సా
గించెద రిప్పు డచ్చరలు క్రీడ యొనర్తురు నందనంబునన్.

ఆలామాలకుఁ బెండ్లి పేరటము లే దాజన్మసన్న్యాస దీ
క్షా లగ్నాశయులై ధరింతు రతిదీర్ఘంబైన కుళ్ళాయముల్
మౌళిన్ వారి యనుజ్ఞలేక విహరింపబోల దెవ్వారి కా
నేలన్ బక్షివి నీకుఁ బోదగని క్షోణీమండలం బుండునే.

ఆ రాజ్యంబును గూబపట్టుకొని బిట్టాడించుచుండున్ దురా
చారంబుల్ వెడ నమ్మకాల కది వాసస్థాన మస్పృశ్యతా
క్రూరవ్యాఘ్రము సంచరించుటకు సంకోచంబులేదైన బౌ
ద్ధారామంబులు సాగనీయవు గదమ్మా! దాని యౌద్ధత్యమున్

అసమ రుచిరాంబువైన మానస సరస్సు
కన్న కూఁతురు బుడుత గంగాభవాని
యెక్కి దిగుచుండు కొండల చక్కఁదనము
ప్రేక్షణీయంబు సుమ్ము గబ్బిలపుదేవి.

బలిసిన మేనులన్ జడల బట్టెల కొమ్ముల వింత సింహముల్
బలె విహరించుఁ గొండల యుపత్యకలన్ సెలయేటినీళ్ళ గ్రో
ల్పులుల కళేబరా లచటి లోయలలో బొరలాడు వాని య
మ్ముల కెనయైన శృంగముల పోటుల దాటులు బడ్డపొట్టలన్

జడనిధివంటి మానసము సాటికిరావు సరస్సులెల్ల నం
దుడుగక రేగుఁ పేరలల యూపున గట్టులఁదాకి ప్రాణముల్
విడిచిన గండు చేపలుఁ గుశీరము లెల్లడఁ దీరభూములం
దడుగిడరాక చీకి వికలాంగములై పడియుండు గుట్టలై.

దమయంతీ నలులకు దౌ
త్యము చేసిన తొంటి పసిఁడి హంస విభుని చు
ట్టములందు పంకజోద్యా
నములందున నాలపింత్రు నైషధ కథలన్.

నిండిన దోరవెన్నెలల నిక్కిన పచ్చిక మేసి, చాందినీ
కొండ బయళ్ళలోఁ దిరుగు గోపతి నీకగుపించు నందు వే
దండవిరోధి దాల్చిన జటాటవిఁ బూచినపూవు చంద్రమః
ఖండము గోచరించు నెఱుకల్గల నీ కెఱిగింప నేఁటికిన్.

విలు నమ్ముల్ ధరించి చెంచులు తదాభీలాటవీమధ్య భూ
ముల గన్పట్టిన నంజలింపుము మహాత్ముండైన భర్గుండు భ
క్తుల కిష్టారము లీయఁగోరిన గణస్తోమంబుతో మాయ పం
దుల వేఁటాడుచు భిల్లుడై నరుల కన్నుల్ గప్పి క్రీడించెడిన్

అచ్చోటి తబిసి రాజులు
నిచ్చలుఁ దపమాచరించు నీ కాతిథ్యం
బిచ్చెదరు పరుల విద్యలు
మెచ్చెద రీ గుణము నేఁడు మృగ్యంబ కదా.

ఇప్పటికిఁ గూడఁ గ్రొంబొగ లెగయుచున్న
త్రిపురముల ప్రాంత ఖూడిద దిబ్బ లచటి
కనతి దూరాన నీకుఁ బ్రత్యక్ష మగును
చిత్రముగ పానమున కెంత చేవ గలదొ.

వలరాజు పగవాని గొలచి ముందుకు సాగు
తొలకరించిన నీలి జలధరంబు
మహిషుని వనిత లుమ్మలికింప గర్జించు
సితికంఠు నిల్లాలి సింహరమణి
కొసరి దిక్కులు మేలుకొలిపి గానము సేయు
కొమరుసాముల వారి కోడిపుంజు
తలఁమీద రతనాలు మొలిచి ముద్దులు గార
నటియించు సర్పంబు నటకురాలు

కనులఁ జూచి రమ్ము కైలాసభూముల
వింతలెల్లఁ దెలుప వేళలేదు
నీకు శుభము గల్గు నిఖిలామరశ్రేణి
సరసుఁడమ్మ బాలచంద్ర ధరుఁడు.

రేగిన గంధపుందరు పరిమళముంగని మోసపోయి యం
దాగి పదంబుమోపవల దచ్చట కొమ్మల నాశ్రయించి మి
న్నాగులు తాండవించు మరణంబును బుక్కిటఁబట్టి యాపదల్
డాగిన తావులే వలఁపులం దొణికించి మనస్సు నీడ్చెడిన్.

పుడమి ననంతకాల రథమున్ గదలించి మనుష్యకోటి పై
నడిపి నశింపఁ జేయు యతనంబులు నీ బెదరింపు లిచ్చటన్
జడవని రుండమాలికలు పండ్లిగిలించి వెడంద నోళ్ళతో
మృడుని గళంబునన్ జెనటిమృత్యువుతో వెకసక్కె మాడెడిన్

ఒలికి పోయిన పండువెన్నెలల పాలు
గ్రోలుచున్నది తపిత చకోరకరంబు
ప్రొద్దువోయెను నీ చిన్ని భోజనమును
వెదకికొనఁ బొమ్ము తబిసి గబ్బితల రాణి.

వీనులు చిన్నవోవ వినిపించు నదే డబుడుక్కువాని ఢ
క్కా నినదంబు తూరుపు ముఖంబుగ హైందవవీధి సభ్యతా
స్థానముగల్గు తాను మన సఖ్య మెఱింగినఁ గంటగించు నో
మౌనిశకుంతమా చను ముమాపతి మేడకుఁ గోడి గూసెడిన్.

న న్నొకమారు నీ దరిసెనంబున ధన్యునిఁ జేసి భర్గుఁడే
మన్నది చెప్పి పొమ్ము విబుధాలయ వాసిని నాకు తేరు నీ
కన్న శరణ్య లాప్తులు వికాసితమైనవి తూర్పు రేఖలున్
కన్నఁపు దొంగతోడ సదనంబునకుం జనుమమ్మ పక్షిణీ.

ద్వారములు లేని నాదు కుటీర లక్ష్మి
స్వాగతం బిచ్చు నీకు మర్యాదచేయు
నా యనుజ్ఞకు వేచియుండంగ నీకు
వలదు వలదమ్మ రాత్రిం దివంబులందు.

నిద్దుర మేల్కొని యల్లన
ఖద్దరు రాట్నంబు పౌరకాంత వహించెన్
ప్రొద్దు పసివాఁడు తూరుపు
ముద్దియ పొత్తిళ్ళలోన ముద్దులు గురిసెన్.

వాని యిష్టార్థములు కూర్చుదానివోలె
విశ్వనాథుని గుడికి గబ్బిలము సనియె
వేయిచేతుల పెనుకాపు వేగిరింప
గచ్చు బిగియించె నప్పేద కార్మికుండు.

# రెండవ భాగము

## తొలిపలుకు

గబ్బిలము కైలాసమునకు సందేశం తీసికొనిపోయి చిర కాలమైనది మనపేదవాడెదురు తెన్నులు చూడసాగినాడు. వాని సందేశ ఫలితంగా నాల్గుమూలలనుండి ప్రసన్న వాయువులు వీవ సాగినవి. దేవాలయ ప్రవేశం, హరిజనోద్ధరణమని గాంధీజీ చరకా ఝూంకరణము శ్రవణ శుభ గంగాగానము చేసినది. సర్వసమత్వ మను మంత్రరాజాన్ని భరతదేశం వల్లెవేయసాగింది. అరుంధతీ సుతుని నిరాశాకాశంలో నాశాతటిల్లతలు మోసులెత్తినయి. తన చిర కాల దాస్యక్లేశాన్ని విస్మరించినాడు. గబ్బిలం తిరిగి దర్శన మిచ్చింది. ప్రఫుల్ల వదనుడై తీయని స్వాగతమిచ్చాడు. పండా, కాయా యని ప్రశ్నించినాడు. పండైనదని ప్రకృతి ప్రత్యుత్తర మిచ్చినది. ఆత్మదేశం, ఆత్మభారతాంధ్రజాతిలో గల అనైకమత్యం స్వార్థలుబ్ధత బహుకుల మతావేశ వ్యాధిపీడ, కొట్టనితనం నేడవని లోని తీరని వేదనలు తనదాస్యముక్తికితోడుగా దేశానర్థకములైన అనేక విషమ సమస్యలతనిని కోరింపసాగినయి. తన యిష్ట దేవత తనజాతికి కేతన చిహ్నమైన గబ్బిలానికతడు మరికొన్ని చింతాసందేశాలను చెప్పకొనసాగినాడు. గబ్బిలమామూలాగ్రంగా ఆలకించింది. నోరులేని పక్షి మారుపలుకుటకు శక్తి చాలని ప్రాణి ఏమని యోదార్ప గలదు? ప్రదక్షిణించి కన్నీరుకార్చి, శివాలయా నికి తరలిపోయినది. అతని వాక్కులు చావులేనివై, వాయుమార్గ మున ప్రతిధ్వనించు చున్నవి. గణబద్ధములై నవి. రెండవ గబ్బిల మను కావ్యమైనిలచినది. నేడుగాక మరొకనాడు ఫలించును. ఫలి తమనుభవించు భాగ్యమతని కున్నదో లేదో.

గ్రంథకర్త

**జి. జాషువ**

బహుదేశ మత మహాపరిషత్తు తలయూచ
పలికి వచ్చినది మా భరతసుతుడు

కండెబొట్టున నైదు ఖండాల నోడించి
కొలుపులందినది మా కోమటన్న

సీమలో నాచార్య సింహపీఠికమీద
నిలిచివచ్చినది మా తెలుగువాఁడు

విశ్వసన్మానంబు వెలయు నోబెలు కీర్తి
రంగ మెక్కినది మావంగసుకవి

చెట్టుచేమల సుఖ దుఃఖ జీవితములు
నిజము దెల్పినవాడు మా నేలవాడు
నన్ను దొలగించి లెక్కించినారు గాని
మొదట నెల్లర మన్న దమ్ములము మేము.

గబ్బిలమేమని చెప్పెనొ
గుబ్బలి యల్లుండు కన్నుగోనల నశ్రుల్
గుబ్బటిలలేచి నల్లని
మబ్బులలో తత్క్షణంబ మాయంబయ్యెన్.

తిరువానుకూరు దేవుఁడు
తెఱచెం గుడితలుపు లితర దేవుండ్లును బి
త్తరపోయి నిమ్నజాతుల
దరిసెనమున దరిసి రాత్మదౌర్భాగ్యదశల్

అంటరాని తనంబునంటి భారత జాతి
　　భువనసభ్యత గోలుపోయెననుచు
క్షమకు మించిన కత్తి జర్మనీ యుద్ధాన
　　గనుగొన్న మొనగాడు గలుగడనుచు
కదురు రాట్నము చేతగాక స్వేచ్ఛా స్వర్గ
　　ముదముజిక్కుట నభఃపుష్పమనుచు
నూరేండ్లు గాదు మున్నూరేండ్లు మనవచ్చు
　　న్యాయమార్గంబున నడువుడనుచు

నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును గాల్చి వేయుననుచు
రాట్నమును దుడ్డుగట్టి కరానఁబూని
దెసలదోతెంచె గుజరాతు ముసలిసెట్టి.

సీమగుడ్డకు కన్నులు చెమ్మగిల్లె
ముతకబట్టకు మర్యాద పొటమరించె
నగరివెలుపలి మాలమాదిగలుగూడ
నరులుసుమ్మని దేశంబు గుఱుతుబట్టె.

వెఱపువలదు నీకు హరిజన సోదరా
స్వీయరాజ్యరథము వెడలివచ్చె
లాగిపొమ్ము నీకు భాగంబు గలదంచు
బాడుచుండె రత్న భరతమాత.

ఒకనాడా మునిపక్షి తొంటి చెలికా డున్నట్టి గేహంబు లో
నికి నేతెంచి యథావిధిం దిరుగుచుండెన్ మిత్రుడీక్షించి యు
త్సుకతం బొంగిఁదరస్మితంబున నిదే జోహారహో పక్షిణీ
యకలంకంబగునీ సహాయమున నాయర్థంబు పండాయెనే?

నావర్ణించిన పుణ్యభూములను సందర్శించినావే మహా
దేవుం డాయన దేవియుం దగిన యాతిథ్యంబు నీ కిచ్చిరే
నా వాక్కుల్ జెవినాటితే మహితరత్న స్వర్ణకాంతి చ్ఛటా
ద్యావద్దివ్యహిమాద్రికందర పవిత్రక్షేత్రముల్ సూచితే?

పుడమి కలుషరాశి క్రుమ్మిగిపోవుచు నుండ
నాట్యమాడుకొనుట న్యాయమగునె
భర్గదేవ సృష్టి పరికించి పొమ్మంచు
బిలిచివచ్చినావె పులుగుచెలియ.

కాళిదాసుని మేఘంబు గౌరవంబు
తెచ్చుకొన్నదె నీదు సందేశ గాథ
ఘనులుచేకొను భూభృదగ్రముల పూజ
యసమ చతురత్వమున్న బానిసకురాదు.

వ్యాస వాల్మీకిముని మదేభములు రెండు
దిరుగుచుండెనె కైలాస గిరులమీద
వారి వార్ధక్యమున నీకు స్పష్టమగును
భరత రామాయణంబుల పదుచుఁదనము.

ఆ వాల్మీకి నిసర్గజంతు కరుణావ్యాసక్తియే సత్కవిన్
గావించెన్ వెదలించె రామునికథా గాంగేయముం గానిచో
త్రోవల్ గొట్టెడు బోయ కేగురువునేర్పుం దివ్యగీర్వాణమున్
ఆవేశించి కళాధిదేవి వరమీయన్ విద్యలేమాత్రముల్.

ఎదురై వచ్చెనె కాళిదాసుని లసచ్ఛృంగార సందేశ మం
బుదమార్గంబునఁదద్రసంబులు ధ్వనుల్ ముత్యాలు వర్షించెడిన్
పదినూరేండ్ల పురాణ మేఘమనుచున్ భావింతువో నిత్యముం
బదియారేండ్ల వయస్సు కూర్పదె సుకావ్యస్పర్శ జేజెమ్మకున్.

జనముల్ మెచ్చు రసప్రసిద్ధమగు నా సందేశ భారంబుతో
జనముల్ సచ్చు విమానమాలికల గర్జాభీషణంబౌ ప్రభం
జన మార్గంబున నీప్రయాణమెటులన్ సాగించి నెగ్గించితో
చెనుకన్నేరవు గండముల్ తబిసిపక్షీ జన్మసన్మార్గులన్.

కన్నులు ధన్యంబులుగా
కన్నావే మంచుకొండ గగనము శిరముం
దన్నెడు దాని నమరగవి
వెన్నవలెం ధవళరుచులు బిండెడుదానిన్.

ఆ కొండయే యిండియా విరోధులదండు
గుండెగాలంబైన వెండికోట
ఆ కొండయే ముత్తియపుదండ భారతో
ర్వీమాతృమణికిం గిరీటభూష
ఆ కొండయే పర్వతాగ్రగణ్యములైన
కులపర్వతముల నిక్కులకునిక్కు
ఆ కొండయే రజతాచలస్వామికి
మణిమయ కల్యాణ మంటపంబు

సింధు గంగా మహానదుల్ చిన్ననాఁడు
ప్రాకనేర్చిన యపరంజి ప్రస్తరములు
పాదచిహ్నాలు పరికించి వచ్చినావె
కలుషములు వాయ కన్నుల కఱవుదీర.

ఇంద్రధనువుబట్టి సాంద్రాబ్దవనవాటి
మెఱగు చున్నవాడు మృగయుఁడొకఁడు
వాడు గొంతుబిసిగి వసుధపై విసరిన
జంతుతతులు నిమ్న జాతి జనులు.

ఆగర్భ ప్రతిభా సముద్రులగు శిల్పాచార్యు లూహింపగా
మూగంబడ్డ శకుంతముల్ పలికి గుంపుల్ గట్టి కీర్తింపగా
వేగుంజామున రంగులద్దు నల శిల్పి బ్రహ్మ దే గ్రామమో
భోగట్టాగని వచ్చితే రసమయంబుల్ తత్కళా పద్ధతుల్.

బెళుకుంజూపులు గుల్కు పోకడలు చూపించూపకూరించుచున్
జలదాగారములందు దోచెదరు కన్యల్ కొందరీక్షించితే
పులుగుంజేడియ యబ్ధిగర్భములలో ముత్యాలుపండించి భూ
ముల కర్పించెదరఁట మేటిగహనంబుల్ సృష్టివై చిత్రముల్.

ఎంతకోయిలపాట వృథయయ్యెనో కదా
చిక్కు చీకటి వనసీమలందు
ఎన్ని వెన్నెలవాగు లింకిపోయెనొ కదా
కటికి కొండలమీద మిటకరించి
ఎన్ని కస్తురిజింక లీడేరెనో కదా
మురికి తిన్నెలమీద పరిమళించి
ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనొ కదా
పండిన వెదురు జొంపముల లోన.

ఎంత గంధవహన మెంత తంగెటిజున్ను
యెంత రత్నకాంతి యెంత శాంతి
ప్రకృతి గర్భమందు! భగ్నమైపోయెనో
పుట్టరానిచోట బుట్టుకతన.

నెలలోనున్నది వృద్ధురాలొకతె గాంధీ శిష్యురాల్నిచ్చలుం
జిలుగున్నూలు తయారుచేసికొనుచున్ జీవించు జేజమ్మ కొం
డలయల్లుండు శిరానసుంచుకొని సన్మానించెదిం బందువె
న్నెల పూదోటల విశ్రమించి మన సందేశంబు నాలించెనే.

నాచిత్తంబునదక్క తోచదెచట న్మాతల్లిరూపంబు ధా
త్రీచక్రంబున దేహమూడ్చి నరు లుర్వింబాపి వైకుంఠమం
దో చండీశ్వరుడుండు మండలమునందో యందురంద్రెల్ల రా
యాచోకిగని వచ్చితే వ్మృతి భవిష్యన్మార్గముల్ విశ్వముల్.

చంద్ర చండకరులు సన్మార్గ గతులయ్యు
నొకనిజూచి యొక్క రోర్వజాల
రెందు కింత వైర మిరువురిలో ద్రావి
డీ డెవండు దెల్పువా డెవండు.

పవ లింపారెడు సృష్టిఁ జీకటి శిలాపంకంబునంబుంపి యి
ట్టవమానించెడు కొంటెవాడెవడు ప్రొద్దల్లంత గన్పట్ట వే
కువ నేమోల నణంగియుండు తమ సిగ్గుంజేటు యోజింప రీ
యవివేకుల్ విరమింపరీ దినదిన వ్యర్థ ప్రయత్నంబులన్.

శివుడు తాండవించి చేకొన్న సత్కీర్తి
తన ప్రయోజకత్వ మని తలంచి
విఱ్ఱవీగడంద్రు- పెక్కురు నటకులు
విఱ్ఱవీగి కవుల విస్మరింత్రు.

వెలవాక్రుచ్చగరాని భావముల నన్వేషించుచున్ సత్కవీం
ద్రులయూహల్ విహగంబులై తిరుగుచుండెన్ బ్రోన్నతాకాశమం
డలమస్తంబున నాకళించితె ప్రయాణశ్రాంతి నమ్మంచుకొం
డలకున్ డిగ్గెడి నీవిశేషము రసజ్ఞజ్ఞేయ మూహింపగన్.

వడుకునూలుచేత బగ్గాలు పేనించి
దొడ్డమృగయు డుచ్చు లొడ్డినాడు
తగులుకొనునొ కాక తప్పించుకొనునొక్క
స్వీయరాజ్య మనెడు సింహరాజు.

నరులన్ ముట్టక నందులం గొలిచి పుణ్యంబెల్ల సాధించున
ప్పరమంబైన రహస్యమున్ శివునితో ప్రస్తావముం జేసితే
పరమేశుం డివి నిమ్న జాతులకు సంప్రశ్నింపగా రాని వే
దరహస్యాలని కోపగించుకొని స్వార్థంబు ప్రదర్శించెనే.

బసుమంబు బూసికొని యే
రసికతలేకుండ బ్రదుకు ప్రమదుల నడుమన్
రసికుడగు సుకవి జీవిత
మసిధారావ్రతము వలవ దది శత్రులకున్.

ఎవరికివారై బ్రదుకుచు
నవీన ధర్మములు పిచ్చినమ్మకములతో
సవరించి ప్రజల తలలో
ప్రవేశ మొనరించు స్వార్థపరులంగంటే.

దిరుసుల్ మార్తురు కొందరాంధ్రులవురా దేశాంతరంబేగి వ
త్సరముల్ పుచ్చి త్రివిష్టపప్రజలలో సఖ్యంబుగావించి యె
బ్బెరికంబైన విదేశ నాగరికతన్ విచ్చేయకచ్చాంధ్ర సుం
దర వేషంబు ప్రతిష్ఠ నిల్పితివి సన్మానార్హ మెంతేనియున్.

చెప్పక చెప్పుచున్నది విశేషములేచని నీ మొగంబు నే
తప్పొనరించి యింతటి వృథాశ్రమ యిచ్చితి మాయదృష్టముల్
దప్పిన దప్పని మ్మనుగుతమ్ముల శ్రేయముగోరి భర్గునిన్
గుప్పెడు గుండెతో యెదురుకొంటివిదే పదివేలు పక్షిణీ!

అపజయంబులు విజయ గేహంబు నిలుచు
స్తంభములు సుమ్ము నీకు విచారమేల
కొద్ది కొద్దిగ నిక్కిన గోడవోలె
సగము సగములుగా పనుల్ ముగిసిపోవు,

ఓటమిలేదు నా యతన మూరకపోదు తుఫానువోలె నా
మాట లుమామహేశ్వరుల మానసముం గదిలించితీరు క
న్నీటపునింగి పైకుబుకు నిర్మలసూక్తి ఫలింపకున్న చో
రాటములో స్వరాజ్యము విరాజిలుటల్ కృతక ప్రచారముల్.

పలనాటన్ మును బ్రహ్మనాయని కృపాబాహుళ్యనేత్రంబులో
పల నాటంబడి నాయురాలి కృతక వ్యాపార దానంబులో
పల భస్మంబయి సంఘసంస్కరణ దివ్యద్విజ మీనాటికిం
ఫలియించెంగద గాంధిలచేయతనముల్ వ్యర్థంబుగావెన్నడున్.

నీకావించిన రాయబారమునకు న్నిత్యాభిషేకంబుగా
నాకన్నీటిని కాన్కగా యొసగుచున్నానో దయాశాలినీ
చేకొమ్మింతకుమించి నావలన నాశింపగ లేదిట్టి నీ
బాకీ దీర్తు స్వరాజ్య సౌధమున నావాసంబు సిద్ధించినన్.

ఏజాతి కెంతవచ్చునొ
రాజత్వంబంత నాకు రావచ్చుగదా
నాజాతి యెత్తు కేతన
రాజంబున నీదుమూర్తి వ్రాయింతుఁజెలీ!

పెల్లుతమస్సులోన దురపిల్లెడు మాబ్రతుకుం దనుస్వినుల్
భల్లున దెల్ల వార్చగల బాబులు పెద్దలనేకు లుండగా
దెల్లనివేల్పు భిక్షకుని దిండికి బట్టకులేని కొండరా
యల్లుని నాశ్రయించి యకృతార్థుడనైతిని పిచ్చివాడనై.

మఱచితి నాదిదేవుని సమానుఁడు బుద్ధునియంతవాడు భా
సుర దరహాస చంద్రికల శుభ్రత లోన గట్టివాఁడు య
ద్దొరలకుగాదు వారి చెవిదూరినవారిన లక్ష్యపెట్టఁడ
ప్పరమమునిన్ సబర్మతి నివాసిని జూచితివే తపస్వినీ.

ముల్లోకి క్కించుక వాలిపోయినను బాపూజీకి దీటైన శ్రీ
వల్లాభాయి పటేలు దర్శనము సంప్రాప్తించెనే నీకు నే
డల్లంతన్ గనుపట్టుచుండెడు స్వరాజ్యార్ధంబు సర్వస్వమున్
గొల్లంబెట్టిన త్యాగి తానత డెఱుంగున్ నా మనఃక్లేశమున్

ధిక్కారించెడు రాచగుజ్జములు స్వాధీనంబు గావింపగా
యుక్కుంగత్తెము జహ్వరుం డతని విద్యుచ్ఛారదామూర్తి న
ల్దిక్కుల్ నిండి నటించుచున్నదనుచున్ దేశంబు లగ్గించు మా
చిక్కుల్ దీర్చుట విస్మరింపదుగదా స్వేచ్ఛాజయాంతంబునన్.

పసుపుం బచ్చని పూతబూచినది ముప్పన్నెల్ పిసాళింపఁ గాం
గ్రెసు మందార మనంతశాఖికలు నిక్కెన్ దిద్దిగంతంబులన్
పసలేర్పడ్డవి సర్వవర్ణములకున్ దచ్ఛాఖిశాఖాతతిన్
వసియింపన్ మనకుండదే స్థలము దివ్యన్మౌని పక్షీశ్వరీ!

కలడంబేద్కరు నా సహోదరుడు మాకై యషకష్టాలకుం
బలియై సీమకుపోయి క్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయి మే
ల్కొలువందుంగల దొడ్డవాఁడతఁడు నీకున్ స్వాగతంబిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే యతనిమెప్పుల్ నీజయారంభముల్.

నేను నాకను నహము ఖండింపలేక
పదియు నెనిమిది శాస్త్రిలు పదును లుడిగె
నీవు నే నను సమత సంధింప గలిగె
తీవ్రతరమైన చిన్న మౌనవ్రతంబు.

వచ్చినవారు సీమనరపాలుర మంత్రు లభీప్సి తార్థముల్
దెచ్చిరి ప్రేమతో భరత దేశజులం దనియింపవచ్చి పో
వచ్చు స్వతంత్రభారత సువర్ణకిరీటము నేడుగాక రా
వచ్చు మరొక్కనాడు సెలవాసిన తొయ్యలి తీర్థమాడదే?

గుడిలోదేవుడు చూచిపొమ్మనుచు నాకున్ వార్తలంపింపగా
దొడగెన్ నల్వురచేత నీవెనుకవత్తున్ నన్ను రమ్మందువా
తడపైనన్ మరణింతురెందరొ విముక్తాహార దీక్షాపరుల్
నడుమన్ నేనుసహింపజాల నొక యాంధ్రప్రాణి శుష్కించినన్

గబ్బిలమవయ్యు శివుని లోకంబునందు
వలయు కదలిక గలిగించి వచ్చినావు
నిశ్చలంబైన కాసార నీరమునను
నలతి శిల చాలదే వలయములుదీర్ప.

అర్థించి చనుదెంతు నగ్రహారముకన్న
సర్వేశ్వరుని యింటి చౌకదనము
అడిగివచ్చెద వీటి నడిబజారునకన్న
గుడిగోపురముల తక్కువతనంబు
పలికించికొనివత్తు బంతి బువ్వలకన్న
తీర్థప్రసాదాల దేబెతనము
ప్రశ్నించివత్తును రాచబావులకన్న
పాతాళగంగమ్మ పలుచదనము

నిజము దేలిచికొనివత్తు నిన్న నేడు
నన్ను జూచిన నల్లంత నడుచుతనము
గుడికిరమ్మనినంతనే యొడలుమఱచి
పరువులెత్తుట నాకంత పరువుగాదు.

ఎంతో దూరము పోవనేమిటికి నే డింటింటికిం బ్రాకి యా
శాంతవ్యాప్తముగారహించెడు స్వరాజ్యస్వర్ణసూత్రంబు చౌ
దంతి స్తంభన మాచరించెగద యేతద్దివ్యసూత్రంబు మో
కంతై నిక్కినకట్టివేయగలదా యస్పృశ్యతావ్యాఘ్రమున్

చాటింపించి మదీయజాతికి నభీష్టంబుల్ ప్రసాదింపగా
పూటా పడ్డది కొంతభారమది రేపో మాపొ రావచ్చు నీ
నాటంగాదని కొంతభారతము పంతంబొప్ప వాదించు నీ
వోడెవ్వారికొసంగితో తెలిపి నన్నోదార్చవే నెచ్చెలీ.

ప్రియములుగాని సత్యములు పెక్కులు నేను వంచించుచుంటి నీ
దయకెడవై తపింతునొ యథార్థ పిపాసువులైనవారి య
వ్యయ కరుణావిశేష రుచిరాత్మ మనస్కుడనై సుఖింతునో
భయపడనేల నాపలుకు పల్కులు బాష్పకణాభిరామముల్.

ఏకవి పిచ్చిగా నడుచు పృథ్వికిలోబడి కీర్తికోసము
ద్రేకము సంహరించుకొని దేశముపోయిన త్రోవబోవునో
ఆకవి పేదమూతి మగదంబుజగర్భుని రాణిగారికిన్
సాకుడుబిడ్డ డాస్తిగల సామికి బేరసిక ప్రదాతకున్.

పుట్టంగావలె సత్కవీశ్వరుడు నీ పుణ్యాన మావంశపుం
బుట్టంజీలిచికొంచు సంచితకళా పూర్ణప్రభారాశియై
పుట్టంగూడదు పుట్టినం గలుగవెప్డున్ నిండుసన్మానముల్
గట్టా యుచ్చత నీచతాయుత వితర్కభ్రష్టదేశంబునన్.

పిడికెండన్నము బెట్టలేదెపుడు మా వేమన్న జీవించి న
ప్పుడు ముద్దుల్ మురిపించు మేలికవనంపుం బుగ్గలుప్పొంగి కా
ఱడపుల్ మొద్దులు మోసులెత్తునపు డౌరా నేడు గోరీపయిన్
నడచుం బూజలు పుణ్య కార్యములు వింతల్ మాదయా ధర్మముల్

బ్రతికియున్న సాయిబాబెన్నడునుగాడు
చావకున్న వట్టి సాయిబయ్యె
తిరుమలేశుడైన తెలియడీ యర్థంబు
చావు బ్రతుకులోని సారమిదియ.

సమతలు సఖ్యముల్ బెదవిజారినమాటలు కట్టుబాట్లు చ
ట్టములు బటుత్వమూడిన గుటారపు దూముడి బంధనాలు ధ
ర్మములు దయారసాల్ మొసలిరాలుచు నశ్రుకణాలు చిత్రచి
త్రములు మతస్వభావములురామరగా వివరింప గల్గితిన్.

ఇప్పుడు గుండుగాతివలె నీశ్వరుడై ముడుపుల్ గ్రహించు కో
టప్పయొకానొకప్పుడు గృహస్థుడు మానవమాత్రులైన రాల్
రప్పలు వేల్పులై సకలరాసులు మ్రింగక మిన్నకుండునే
యప్ప పులుంగురాణి యిక నాసలులేవు క్షుధార్త జాతికిన్.

మరణము వార్ధకంబను ప్రమాదమెఱుంగనికై తలల్లి న
ట్టురపుఁ గవీంద్రు రెడ్డికులముఖ్యుని వేమనచాకచక్యమున్
మరచి పురాణకావ్యరస మత్తుడు వీరుడు సంఘసంస్కృతి
స్థిరుడు రచించె నాంధ్ర కవిజీవితముల్ బొరపాటు చేయుచున్.

దొడ్డరాళ్ళగుండ్లు దొరలించి పరితల
బెదురు బెట్టు కవిత విస్తరించి
పండితులకుదక్క పరుల కందకపోయె
దేవతలకు కామధేనువట్లు.

కవితచచ్చుదయ్యు గథ పేరుగలదైన
గవికి కొంతకీర్తి గలుగవచ్చు
నెలలు తక్కువైన బలమైనతిండిచే
నుసురునిల్పుకొన్న నిసుగువోలె.

వ్యాకరణ శాస్త్రకారులు
క్షాకుఁ గకారంబు విరతి గన్పడదని చీ
కాకుపరతు రంతెకానీ
పాకము రసమింపు సొంపుఁ బరికించెదరే.

వ్యవహారంబున భ్రష్టమయ్యు రసభావస్ఫూర్తి గల్పించి మా
ర్ధవముల్ శబ్దములెన్నియో కలుగు శాస్త్రజ్ఞాన మాత్రుల్ పురా
కవితోన్మత్తు లెఱుంగజాలరుదు రెకుగ్రామీణ భాషాబ్ధిలో
జవులూరించు తెలుంగుపల్కుల జగాస్వారస్యరాహస్యమున్

కనుగొన్నావుగదమ్మ కృష్ణవిభుడక్కాలాన భాషావనం
బునసాగించిన యష్టదిగ్గజరథంబున్ శారదావాహమున్
తెనుంగు దేశము విస్మరించినది తద్దిగ్దంతి దంతావళ
ధ్వనియధ్వాన్నపుటద్రిగర్భముల నిద్రంబోవునాంధ్రత్వమున్.

తెల్గు తేజంబెల్ల దిక్కులకెగబ్రాకి
పగవాని బెదరించి వచ్చునపుడు

తెలుగుశిల్పుల సుత్తెదెబ్బ ఖంగుమ్రోసి
చీనాకు పయనంబు సేయునపుడు

తెలుగుకవిత్వంబు దిగ్దంతులముఖాన
బృంహితధ్వనులు గావించునపుడు

తెలుగుజెండాశక్తి నలుదెసల్ ప్రసరించి
విద్యానగరవీధి వెలుగునపుడు

రామలింగని హాస్యకార్యములు దలచి
నాల్గుదిక్కులు కడుపుబ్బ నవ్వునపుడు
నాట్యమాడిన యానంద నవ్యలక్ష్మి
కానుపించెనె శిథిలదుర్గములయందు.

అక్కట తల్లికోట సమరాంగన యాఖరు తెల్గుపోటుచే
యుక్కిరి బిక్కిరై తురకయోధులవంకకు వాలునాడు భూ
భుక్కులగండడౌ తెలుగుభోజుని పూజలు చూరగొన్న యా
టక్కరిదేవతల్ తనువు డాచుట నాకు నసహ్యమయ్యెడిన్.

తొంబదియేండ్ల వృద్ధుడతి దోర్బల భీముడు రామరాజు డెం
తెం బరగండడౌ నృపమణీ సుతభర్త మహమ్మదీయ ఖ
డ్గంబులకున్ శిరం బొసగి కష్టముదెచ్చినమాట ఆంధ్రవ
ర్గంబు సహింపనేరని పరాభవమై భవమై దహించెడిన్.

తెలుగులండను నగరంబు తెలుగుకోట
తెలుగుకవి దిగ్గజంబులు తెలుగుదనము
పొట్టిగుఱ్ఱమునెక్కిన పొగరుబోతు
టళియరామునికతన ముక్కలయిపోయె.

విహరింపనే భీతివిడిచి మస్తమునెత్తి
సకల సామ్రాజ్యమహా సభలలోన

వాక్రుచ్చనే రాలు పగిలి బుగ్గలుజిమ్మ
నతి నిశాతప్రబంధాదికములు

కల్పింపనే తెల్గు కల్యాణికొప్పున
సొగసైన కీరితి పొగడదండ

ఎత్తింపనే మేటి హిమవద్గిరులమీద
శాశ్వత విజయ రాష్ట్రధ్వజంబు

సగరగర్భకుహరి స్వారిగావింపనే
యింటి గుట్టు బయటి కెక్కకున్న
సమ్మతించి జాతి కుమ్మక్కుగానున్న
కొండలన్ని పిండిగొట్టనొక్కొ.

అది మారత్నముః లారబోసికొను విద్యాశారదాపీఠ మ
ల్లది మాకత్తుల ఖారుఖాన మది యాంధ్రాదిత్యబింబంబు సం
పద సొంపారిన మాల్యవంతమని డంబంబొప్ప చాటించు స
మ్మద సౌఖ్యంబొక తెల్గువీరునకె సంప్రాప్తించెముమ్మాటికిన్

కలవెన్నో విషయంబు లాంధ్రుల కళాకౌశల్యముల్ సాటు తా
పులు ప్రత్యర్థులగుండెలో వెరపు నివ్వాల్ సల్లు గాథావళుల్
కల విప్డున్ బలనాటి పౌరుషపు రేఖల్ మా శరీరంబులన్
కలుపుంగోలుతనంబులేదది కళంకంబంద్రు మాజాతికిన్.

ముసలిమానులలోని యసమ సమత్వంబు
అంగోటిగట్టి చెలంగుచుండ
ఘూర్కా సిపాయిల కుటిలశౌర్యజ్వాల
నట్టింట కాపలా నడుపుచుండ
ద్రవిడుల కార్య సాధన ధనార్జనదీక్ష
సొంటారు నోరెత్తి చాటుచుండ
రాష్ట్రాంతరములకు బ్రాకి హిందీ భాష
పదుగురినోళ్ళలో నెదగుచుండ

అఖిలదేశములకు నవతంస కుసుమంబు
రాజితోగ్రకదన రక్తతిలక
మానధనికురాలు మా తెల్గుటిల్లాలు
కలత జెందదొర కాలమహిమ.

గౌతమి గంగలోన మృతకాంతులతో నుదయంబుగన్న వి
ఖ్యాత మణీ వితానము మహమదురాజుల దండు దెబ్బతో
తాతలనాడ పోయె నిక తాతలుబుట్టిన రావు రత్న దీ
పాతత-కాంతులీను గృహ మక్కట నూనెకు దేబెరించెనే.

రతనా ల్డాంగలు దోచుకున్నపుడు శౌర్యశ్రీలు విద్రోహిభూ
పతులేటేట మృదుక్తి చాతురలచే బంధించునాడేని భా
రత చండీశ్వరి కోటిహస్తముల దర్పంబుంబ్రదర్శింపదో
ధృతిహీనంబగు భిన్న భిన్న మత విద్వేషంబు పాటించెనో.

గప్పాల్ గొట్టిన నేమి లాభము ధరా గర్భాన నిద్రించు కృ
ష్ణప్పల్ పాతలు లేచివచ్చెదరె వీరావేశ విఖ్యాజితుల్
నిప్పంబోలు తెలుంగువీరు లిపుడున్ జీవించియున్నార లీ
చప్పబడ్డ యనుంగు సోదరుల కుత్సాహంబు సంధింపగన్.

ఏనాడు మా కావ్య సృష్టికర్తల జిహ్వ
విశ్వసత్యము నాలపింప గలదొ
ఏనాడు మాజాతి దృష్టి మాంద్యమువాసి
చుట్టుప్రక్కల దేశ చూడగలదొ
ఏనాడు మా బుద్ధి లీ జుట్టు తలలేని
పుక్కిటి కథలలో జిక్కువడదొ
ఏనాడు మావిద్య లిమపసంఘమునందు
చిలుము పట్టక ప్రకాశింపగలదొ

తనువుదాచక సోమరితనము మాని
యెన్నడీమఠంబులు బిచ్చమెత్తుకొనవొ
అట్టి శుభవేళకై కొంగుబట్టి నిలచి
నలిగి వాపోవుచున్నది నామనస్సు.

ప్రభువుల పెండ్లి పేరంటాలు వర్ణించి
కాలంబు పెక్కేండ్లు ఖర్చుపెట్టి
విరహవేదన మేనుమఱచి మూర్ఛలువోవు
రాణివాసంబును రచ్చకీడ్చి
అంగాంగ వర్ణనా వ్యసనంబు రెట్టింప
యువకజీవితకోటి కుచ్చులొడ్డి
పదియునెన్మిది మార్లు బాడిన శ్రీరాము
చరితంబు వగరెక్క తిరుగబాడి

శరణు శరణటంచు బరుగులెత్తుచు వచ్చు
నార్తలోక రుత మనాదరించి
భువన హితముగోరు కవితాకళాశ
స్వార్థజడధి నూరవైచినారు.

పెద్దల శల్యముల్ బలె వివేక మొసంగని గ్రంథరాసులే
విద్దియలైన నింక బది వేల యుగా ల్దలకాయలేని గం
గెద్దులు బుట్టి స్వార్థపరులెత్తిన గంతలుమోసి తీరెడిన్
బుద్ధి చిగుర్చునే యరుచి బుట్టుకథల్ దలమీద రుద్దినన్.

ఆదుది లేకయున్న గృతి కందములేదని నమ్మి యెన్నడో
పాడి రనుత్తమ ప్రణయ బంధుర గీతము లర్థతృష్ణవె
న్నాడ కవుల్ మహీపతి బృహన్నళ వర్గము సంతసింప నీ
నాడు రచింతు రిద్ధ కరుణా పరిణద్ధ రసప్రబంధముల్.

మొన్నటి యుద్ధదేవతకు బుట్టిన కూతురు క్షామదేవి మృ
ష్టాన్నముగా భుజించిన క్షుధార్తుల డొక్కలు శల్యరాశి సం
పన్నుల వీధులందు గనుపట్టెనె? వంగకవీంద్రకోటి చే
కొన్న కలాలెరుంగవనుకొందు దయారస నవ్యకావ్యముల్.

చలిచీమం బొలియింప నేరని యహింసా మానసుల్ జాలలో
మొలిపించెం బహుబుద్ధ విగ్రహచయంబుం భారతంబంతటన్
కలయైపోయెనొ తత్కృపా గుణము బంగాళంబులో ప్రేమమూ
ర్తులులేరో భుజియింపరో ద్రవిణవంతుల్ మేలి మృష్టాన్నమున్.

ఎట్టు నశించి పోయె నితరేతర విశ్వసనంబు లెందు కీ
చట్టములుం ప్రమాణముల సారమషీరస పత్రలేశముల్
కొట్టిన గొట్టుమం చెదరి గుండియలం గరగించు ధర్మముల్
బుట్టినగడ్డలో నకట పూత్కృతి సల్పు నశాంతిసర్పముల్

అనఘుం డశ్రు మషీజలంబున వివేకానంద సన్యాసి వ్రా
సినవ్రాతల్ దడియారలే దిపుడు ప్రాచీనంపు టజ్ఞాన బం
ధన విచ్ఛేదమొనర్చి యే ఘనుడు విద్యాభిక్ష గావించి ప
చ్చని బంగారమువంటి మా భరత సంసారంబు నెగ్గించునో.

గాలిఁదూరెడు శుష్క దేహములతో కాషాయ వస్త్రాలతో
శూలంబుల్ సొరకాయ బుఱ్ఱలు జటాజూటంబు లుందాల్చి యా
మూలాగ్రంబుగ భ్రష్టులై తిరుగు బాబుల్ దొడ్డగంజాయి ఛా
యీ లున్నా రెదురైనవారె మునిపక్షీ కుక్షిరక్షాపరుల్.

జపమో ధ్యానమొ యభ్యసించి యతివేషంబూని క్రీడించి మో
సపు బార్థుల్ ప్రతి పల్లెటూర గలరీ సన్న్యాస వర్గంబు ని
కుపదేశింపదొ యిష్టసిద్ధికని మాయోపాయ మంత్రంబు భ
క్తిపర్వ్యతంబొక సాధనం బిహ పర శ్రీ పంచక శ్రేణికిన్.

పాలుంబండులు కందమూలములు మాభక్షాన్నముల్ గోరమే
కాలం బన్యపదార్థముల్ రజితమో బంగారమో కొద్దిగా
జాలున్మాకని సేకరించెదరు గోసాయీ లుపాయాలు మో
సా లెన్నేని నిరంతరాయముగ రాజ్యంబేలు నేడెల్లెడన్

వృత్తుల్ సర్వము త్రుప్పుపట్టి చనగా భిక్షాటనంబుల్ జగా
వృత్తుల్ కా పలుజాతులై నిలువ దుర్భిక్షంబు రాకుండునే
యుత్తుంగాశయు లెందరో కలరు దేశోద్ధారకుల్ పూనరీ
చిత్తంబేర్చు కళంకమున్ దుడిచి సుశ్రీ నేలకుం గూర్పగన్.

ఎన్ని సుక్షేత్రములు సొర మిగిరిపోయి
ముండ్లతుప్పల బంజర భూములయ్యె
ధృఢతరంబైన యెంతెంత దేహశక్తి
భిక్షకులమేన జీర్ణించి పృథివి గలిసె

పదవుల పీటలెక్కి యనువారము లంచపు బాడిబత్తెలం
బిదికి గడించి కార్మికుల పేదల చెమ్మట దెచ్చి కొన్కలి
చ్చెదరు పరోపకీవులు విచిత్రపు భక్తులు వేషధార్లు నీ
కెదురయి వచ్చిరే వల దిసీ చెయిసాచకుమమ్మ పక్షిణీ.

నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు
ధర్మశీలురున్న ధరణిమీద
కాలుమోపలేక గబ్బిలమొక్కటే
చరణయుగళి దివికి సాచినడుచు.

పూజారి బోషాణమును కాపలాకాయు
చిల్లర వేల్పుల సేవజేసి
గొఱ్ఱెపోతుల నల్ల జుఱ్ఱి గఱ్ఱున ద్రేచు
కరకు సత్తులకు జాతరలు సల్పి
ఏటేట పెండ్లిజేయించుకొం చుదయించు
కృతకరాముల పల్లకీలు మోసి
నిలువుదోపిడి చేసి తలకాయ గొరిగించు
యేడుగొండలవాని మేడలెక్కి

అంబుధీశుని కళ్యాణులని తలంచి
ముంచుగంగమ్మలకు డబ్బుపోసి పోసి
పాతకమువోలె నావెన్ను వాయకున్న
గోచితో నిల్చియున్నాడ పేచకంబ.

గుట్టాలకు లెక్కలుగల
పెట్టియుగాల్ దాటిపోయె విజ్ఞానంబున్
బుట్టిగల గాంధి యుగమిది
కట్టిలు ఖడ్గంబు లేలగాలేవు ప్రజన్.

రాజుగారి గుఱాల రథచక్రముల క్రింద
మరణించు రైతుకు శరణమిచ్చి
నరజాతిలోన నంతరము లుండుటకన్న
నఘములేదను ధర్మమాకళించి
బహుమతాచార దుర్భర పదాహతిచేసి
అసురుసురగువారి కభయమిచ్చి
రాజభాషలకన్న రాష్ట్రభాషలలోన
రసమున్నదను యదార్థత నెఱింగి

యుగయుగాలనాడ యూబిలోదిగబడ్డ
మహితమైనజాతి మత్తగజము
ప్రబలదాస్య నిగళబంధంబు లగలించి
దెసల మసలుచున్న దినములివ్వి.

కలరే మోసపు దేశభక్తిపరులకైకైలాస దేశంబునన్
చలికిం ఖద్దరుధారులై యవల స్వేచ్ఛారాజ్యభాగంబు రా
గలదంచున్ విహరించుపెద్దలు పతంగస్వామినీ నిమ్న జా
తులపై వీరువెలార్చు బాష్పములుచిందున్ దియ్యగా పుల్లగా

మా దౌర్భాగ్యపుజాతిలోన నొకనిం బాధింపకున్నట్టి యీ
యాదివ్యాధికి నగ్గమై కుములుటేలా నాకుఁ జోనిమ్ము నా
చేదస్తంబిది కష్టపెట్టితిని పక్షీ రోషగా డెన్నఁడున్
బ్రాదుర్భావమునందరాదు పరసేవాభ్రష్ట వంశంబునన్.

కలదమ్మా వ్రణ మంటరానితన మాకర్ణింపుమీ యిండియా
పొలమందుంగల మాలమాదిగలకున్ భూతేశుడేకాదు కృ
ష్ణులు కృష్ణున్నిరసించు దైవములు క్రీస్తుల్ మస్తుగాబుట్టినన్
కలుపన్నేరరు రెండుజాతులను వక్కాణింప సిగ్గయ్యెడిన్.

చాకిరిజేసితిం దెలుగుజాతికి నేబదివత్సరాలు నా
వాకిలిద్రొక్కిచూడవు శుభంబులుసౌఖ్యము లెంతకాలమీ
బాకి వయస్సుతో నడుగుబట్టిన యాసలు తెప్పరిల్లునో
లేక నశించునో తెలుపలేడుగదా మదనాగవైరియున్.

శుభశిశువో యదిగాక య
శుభశిశువో దెలియరాదు క్షోణీసతికిన్
బ్రభవించు బిడ్డ యకటా
యభంగుర ప్రసవబాల కగ్గంబయ్యెన్.

అరవం గుత్తుకగోసి జంతువుల గర్భాగారముల్ జీల్చి నె
త్తురుటేళ్ళన్నటియించుమూఢతమజాతుల్ జాతరల్ సేయజూ
తురు చూపింతురు ప్రోత్సహింత్రుతతివాదుల్ శాస్త్రపారంగతుల్
కరుణల్ కమ్మనిబోధలో పులుగుటక్కా ఛీ! హుళుక్కుల్ గదా

కని గంగార్పణమంచు ద్రోసిచనియెం గర్జున్ బృథాదేవి యా
తని విద్యా కుల రూప సంపదలు వ్యర్థంబై ప్రలాపింపవో
కనియెన్ భారతకుంతి నుమ్మల నసంఖ్యాకంబుగా కర్ణులన్
మునిపక్షీ యమనందనుల్ తెలియరిప్డున్ మాదుభ్రాతృత్వమున్.

ఒకడు రుద్రాక్షమాలికలు నెత్తికి జుట్టి
శివమూర్తియై భూమికవతరించు

ఒకడూర్ధ్వపుండ్రంబు లురువుగా దగిలించి
శివలింగమునుజూచి చీదరించు

ఒకడు రెండునుగాని వికట వేషముదాల్చి
పై వారిమీద సవాలుసేయు

ఒకడు గంజాయిదమ్ముకు దాసుడై పోయి
బూడిదగురవడై పుట్టివచ్చు

మనుజులార మాది ఘనమైన మతమని
ఒకడు తరిమి తరిమి యుగ్గడించు
పెక్కుమతములిట్లు పేచీలుసాగింప
మార్గమేది యైకమత్యమునకు.

మొక్కుబళ్ళ నెపాన చక్కని పసిపాప
లెందరు గంగలో నిమిడిరొక్కొ

సహగమనాచార దహనదేవత లెన్ని
చిగురుగొమ్మల బూదిచేసెనొక్కొ

చదువుదాచెడు దురాచరణ మెందరి కళా
    భ్యసనచాతురి గొంతు బిసికెనొక్కొ

పొందెరుంగని వేరుబందాలచే బాహు
    బలమెంతగా చచ్చువడియెనొక్కొ

చిలిపిరాలకు నగిషీలు చెక్కి చెక్కి
కాలమెంత యగంతాన గలిపిరొక్కొ
చదువనేర్చిన వెట్టిని జంపగలరె
ఒక్కబుద్ధుడు నొకక్రీస్తు ఒక్కగాంధి.

శిలవంటి యూరిసత్తులకు సెత్తుటికూడు
    రేపులు మాపులు మేపలేక

ఆచారమని తప్పదని వెంటబడివచ్చు
    గురులదక్షిణ లిచ్చుకొనగలేక

మంత్ర తంత్రముల సోమరిమాంత్రికుల బారి
    బడి ధైర్యమును చిక్కబట్టలేక

శతసహస్ర క్రూర మత సింహములు సేయు
    కుటిలగర్జకు తట్టుకొనగలేక

అనుగు తమ్ముల సిరు లోర్చుకొనగలేక
పిచ్చిపూజల మమతలు విడువలేక
అమరనుతమైన మాదు దేశాభ్యుదయము
యుట్టికిని స్వర్గమునకెక్క కూగులాడు.

విందుభుజించి పొమ్మనుచు బిల్చుటకర్హతలేదు నాకు క
ర్మంది పతంగినీ పనికిమాలిన సంఘము సమ్మతించునె
పొందులు పొత్తులు న్మనకు ముప్పదినూర్ల కులాలవారికిన్
నందుల నాగులంగొలిచి నవ్వులపాలగుచున్న జాతికిన్.

స్వయముగ నన్నపూర్ణ తనభర్తకు సిద్ధము జేసియున్న య
వ్యయరుచిరాన్నమున్ శివుని పంక్తి భుజించిన పూజ్యురాల వ
న్వయము తరించె నిట్టి మునిపక్షిణిపై కులభేద బుద్ధిచే
కయికొనకుందువే సఖుల గర్భదరిద్రుల యాతిథ్యముల్.

తులవాక్రుచ్చగరాని నెత్తుటిసిరాతో వ్రాయుచున్నారు మ
త్కులజుల్ దుఃఖరసోత్కటంబులగు పెక్కుల్ గావ్యముల్ జాతి లు
బ్ధుల వజ్రస్థిరచిత్తముల్ గరగి సంతోషించునో యీప్సితం
బులు పండింపక సుంకుతోసమసి మాయీల్ త్రోవలం ద్రొక్కునో.

కవిగారికిదె నమస్కారంబనెడువాడు
కళకు లెమ్మని పరోక్షమున బలుకు
కవనంబునకు మేను గరగి మెచ్చినవాడు
కవిచెంత పెఱబెఱికముగ మసలు
విద్యా కళంకంబు వెదకజాలనివాడు
జాతిలేదని నోరుచప్పరించు
శాఖీయులకు సహస్రములు బోసినదాత
అన్యుల మధుర వాక్యముల దనుపు

జీవకళలు చెక్కు శిల్పిని నిరసించి
శిల్పమునకు పూజసేయునట్టి
వక్ర చరితులైన వ్యక్తులు గలచోట
కళల కకట ప్రేత కళలగతులు.

పోటీసేయ సమర్థులయ్యెదరె మాముక్కన్న తిక్కన్నతో
మెటుల్ షేకుసుపీయరుల్ బయిరనల్ మిల్టన్లు గోల్డుస్మితుల్
నాటైనారు స్వకీయులైన కవు లీనా డన్యభాషాకవుల్
నీటై రక్కట కాలమాంత్రికుని పాండిత్యప్రభావంబునన్.

జాతీయోద్యమ యుద్ధరంగమహితోత్సాహ ప్రతిధ్వానముల్
కూతల్ బెట్టుచు నాల్గుజాతులకు గగ్గుర్పాటు గల్పించెడిన్
స్వాతంత్ర్యంబను స్వర్గసౌఖ్యమున మా భాగంబు మాకిత్తురో
ఖాతాలేదని త్రోసిపుచ్చెదరొ వర్ణాకణింపవే చెల్లెలా.

కలధౌతాద్రిగుహల్ ప్రతిధ్వను లెసంగన్ దెల్గు రాష్ట్రార్థమై
గలభా రేచిరి సోదరాంధ్రజను లాకర్ణింపవో నీవు చె
ల్లెల రాష్ట్రంబు గడించినారనుచు హాళిందేలితో తెల్గు బి
డ్డల యత్నా లనరాదుగాని యవి సోడాబుడ్డి యుద్రేకముల్.

బలియైనాడు ధరాహితార్థము మహాభాగుండు యేసుండు త
త్ఫలితంబై కనుపట్టు భిన్నమత సిద్ధాంతంబులుం జీలికల్
కులముల్ గుట్ట లనైకమత్యములు చిక్కుల్ జీదరల్ రిత్త బో
ధలు వేదాలు పదాలురాల్పు వర చేతన్మౌక్తి ముక్తామణీన్.

భోగు లాహరించు భుక్తి కన్నుల జూచి
పరమ పేదలు దుఃఖపడని చోటు

సాంఘికాచార పంచాస్యగర్జనమున
బెదరక జ్ఞానంబు పెరుగుచోటు

జాతివైషమ్య రాక్షస పదాహతి చేసి
కందక కళలు పెంపొందు చోటు

పరిపాలక క్రూరతర కరాసికి లొంగి
పోక స్వేచ్ఛాలక్ష్మి పొదలు చోటు

అనదబిడ్డలు జూడ నెయ్యంపుసుతుల
ముద్దులాడని గుణనిధుల్ బుట్టుచోటు
చెప్పగదవమ్మ చూచివచ్చితివె నీవు
నిశ్చయంబుగ వాసముండెదను నేను.

పయి పైనవ్వులు పల్కరింపులు మృషాబాంధవ్యముల్ సూపియా
పయి శత్రుత్వము సేయు నాగరికతా భ్రష్టస్వభావాధముల్
సయితానుల్ చరియింపనట్టి ధర గోష్పాదంబు గన్పట్టినన్
దయతో నాకెఱింగింపుమమ్మ యచటన్ నాయిల్లు గట్టించెదన్.

కళలం దాచెడు చుప్పనాతితన మింకం దేశమందున్నచో
కలదే ముక్తి ప్రపంచసభ్యతకు మార్గం బుండునే జాతికిన్
తలయుం దోకయు లేని తొంబది సమాధానంబులం జెప్పి పే
దలవంచించు కళానిహంతలె యనర్థం బీ శుభక్షోణికిన్.

బుద్ధభేదంబుల కెనయైన మూడునాళ్ళ
పదవులకు ప్రతిష్టలకునై ప్రాకులాడి
నరులనమ్మించుకొనలేక నమ్మలేక
చిదికియున్నవి మాజాతి జీవితములు.

ఆసల్ చెప్పదురిప్పుడిం గురుబు ముందాకాశసింహాసనా
ధ్యాసీనత్వము సంఘటించు నిదిసత్యంబంచు రూపింతు రీ
బీసీనాటి పురాణగాథలు రుషావేషంబుతగ్గించి నా
దాసత్వంబు స్థిరీకరించెడు పరంధామంబు నాకేటికిన్.

పుట్టుకపూర్వమే తలను బుంపినజాతి మతప్రచండ సం
ఘటనచేసినా సహజకౌశలముల్ నశించిపోయె నీ
కట్టినకట్లు విప్పునధికారములేని గురుండెవండొ యీ
యుట్టికిసెక్కలేని నను నూచెడినంట వికుంఠడోలికన్.

ననుసృష్టించినవాడె నావెనుక జన్మంబెత్తునే నోరెఱుం
గని నన్నీపదివేల రూపములతో కంగారుగావించునే
కనకంపుంగుడి గోపురాల్తనకు నాకాంక్షించునే కానుకల్
గొనునే యిట్టివిమోసగాండ్రయిన భక్తుల్ పన్నుపన్నాగముల్

అనినమాటను మార్చుకొనలేని శాస్త్రముల్
స్వాభిమానముదక్కి పలుకగలవె?
కులముంచుకొని నన్ను గొలుచుకొండను వేల్పు
కడగి నాకన్నీరు దుడవగలడె?

మానవదాస్యంబు మరగిన లోకంబు
  నెనరూని నా చెల్మి నెఱపగలదె ?
అస్వభావిక కథావ్యాసంగ హతమైన
  పృథివి సత్యంబు నూహింపగలదె ?

యుడుకురక్త మెన్నడో చచ్చుబడిపోయి
చేతులెత్తి మ్రొక్కు స్వీయజాతి
కలుకు వీరసూక్తు లరిగించుకొని వేచి
యెదుటనిలచి పగర నదమగలదె.

ధర్మసంస్థాప నార్థంబు ధరణిమీద
నవతరించెద ననె నబ్జభవునితండ్రి
మునుపు జన్మించి నెత్తి కెత్తినది లేదు
నేడు జన్మింపకున్న మున్గినదిలేదు.

కనబడలేదు దైవతముగాని పదార్థము భారతంబునన్
గనుపడలేదు వర్ణనముకన్న మహాకళ భారతంబునన్
కనుపడలేదు సత్కులముకన్న పిశాచము భారతంబునన్
గనుపడలేదు పంచమునికన్నను నీచపుజంతు వేదియున్.

హక్కుల్ దొంగలుదోచుకున్నను మనుష్యత్వంబుజంతుత్వమై
చిక్కుల్‌పెట్టెడు కాలమందును క్షమాసిద్ధాంతముల్ నేర్వ నా
పక్కపౌరుషవహ్నినార్పు మత రూపక్రూర సింహంబు నా
ప్రక్కం బండులనూరుచున్నది తలంపన్ శల్యసారథ్యమై.

జగముల్ మెచ్చ బియే లెమేలు బిరుదుల్ సాధించినామంచు నీ
లుగు మామాలలు మాదిగల్ గులమహాలోభంబు రెట్టింపగన్
తెగలంగట్టి తగాద లెంచెదరు గానీ సంధి గావింపరో
ఖగభామా మతబోధలేల కుల కక్ష్యాభ్రష్ట దుర్జాతికిన్.

అసలే ముక్కిడి దానిమీద పడిసెంబన్నట్లు మాజాతి బా
నిసలౌరా కలహించుచుందు రుభయుల్ నీచోచ్చతా నిర్ణయ
వ్యసన వ్యగ్రత సిగ్గుచేటగు నయో యస్పృశ్యతా త్రాసమం
త్రసమేతుండగు గాంధి నేరడివి యంతర్నాటకారాటముల్.

భీతింగొల్పెడు నస్వభావిక కథావేదంత శాస్త్రాళికుం
జేతుల్ మోడ్చు నమాయకప్రజలు సంసేవింప భోగాబ్ధిలో
నీతల్ గొట్టు కవిప్రకాండముల సాహిత్యప్రపంచంబులో
ప్రాతః కాంతుల జిమ్మునట్టి కవితాభానుడు జన్మించునే.

నటకుని వోలి కాలపరిణామవిధేయములై రహించు ను
త్కట మత ధర్మశాసన నికాయముతీరుపు చేసి సంఘ సం
కటముల పాలొనర్చి యధికారముసేయు దరిద్రజాతిపై
కటకట నల్వురాడు నెడ కల్ల యథార్థము గాకపోవునే.

రచ్చలకెక్కనీక సమరంబున బూడ్చిన కర్ణుశక్తి నే
డెచ్చట జూచినం బ్రభవహించి సముజ్జ్వలమై వెలుంగదే
కచ్చ లసూయలుం గళ నొకానొక కాలము డాచియుంచినన్
హెచ్చి తురంగలించి ధ్వజ మెత్తకపోదు యుగాంతరంబునన్.

కవ్వడి పరువున్నిల్పఁగ
నవ్వసుదే వాత్మజాతుఁ డట్లనెగానీ
కవ్వడి కర్ణుని గెల్చుట
నవ్వులపాటనెడుమాట నల్వురెఱుఁగరే.

వలదన్నన్ వెనువెంటనంటి నను నిర్బంధించుచున్నట్టి వే
ల్పుల సిద్ధాంతములెల్ల నా సహజ సంపూర్ణ ప్రతాపంబులో
జిలికెం జిక్కని చచ్చుమందు మునిపక్షీ యుండఁ నీవంటి గ
బ్బిలముల్ సేయు హితోపదేశములు నాకే వేల్గాలికాహారముల్.

అగుపించెనే యసూయా దుర్గుణజ్వాల
సంహరించెడు శాస్త్రసముదయంబు
పరికించివచ్చితే పరమతసహనంబు
భాషించు వేదాంతపాఠశాల
వీక్షించితే వర్ణభేదాల వ్యాధిచే
శాంతిగా రాజ్యంబు సలుపు నెలవు
కనుగొంటివే మనుష్యునిజూచి మనుజుండు
మిట్టమీదై దాటునట్టి సీమ
నేను చిందులాడి నేను డప్పులుగొట్టి
యలసి సొలసి సత్తి కొలుపు గొలువ
ఫలితమెల్ల నొరులు భాగించుకొనిపోవు
నీచమైనభూమి జూచినావె.

10)

క్రూరుల్ కుత్సితు లస్మదీయములు హక్కుల్ దోచుకొన్నారు న
న్నారింబయుటకు నెట్టినా రిపుడు నన్నోదార్చుచున్నారు గాం
ధారేయుల్ నెలకొల్పినారు బహుసంస్థల్ లక్కయిండ్ల క్కటా
మారుందమ్ములు నమ్మజాలనివి స్వాత్మశ్రీ సమారంభముల్

తనురక్తంబు వ్యయించి సత్కవికళాద్రవ్యంబు వెచ్చించి మ
ల్చిన శిల్పాలు విమర్శక ప్రభువుల కల్తీవ్రాతలం ఖ్యాతికె
క్కనిపై పోయె నసూయచేబలుకు నాల్కల్ సత్యమున్ జాటునే
అనుమానింతురు కొందరీశ్వరుని ధర్మాధర్మ నిర్ణేతృతన్.

జనులం బీలిచి పిప్పి జేసెడు దురాచారంబులన్ గాల మ
ట్టని విద్యాబలమేల విద్యయన మౌఢ్యవ్యాప్తికింపైన భో
జనమా మోసపువ్రాతకోతలకు రక్షాబంధమా యెందుకీ
మనుజత్వంబు నొసంగలేని చదువుల్ మైరేయపున్ మైకముల్.

చిరకాలంబును భిన్న జాతి మతముల్ జీవించు రాజ్యాన సు
స్థిరమై శాంతి రహించునన్న నుడి సందేహించెదం బక్షిణీ
తురకల్ హైందవులీ స్వరాజ్యరథమున్ దొర్లింతురే దక్షిణో
త్తరదిగ్దంతులు రెండునుంగలిసి మేతల్ మేయు తావున్నదే.

వీర వసంతరాయడను పేర్వొక దుద్భవమంది దుష్ట సం
హార మొనర్చి ధర్మము సహస్రముఖంబులు నాటునంచు నా
జారిన గుండెలో వెలపు సల్లుదు రీయనృత ప్రచారకుల్
కారణమమ్మ పిచ్చితలకాయలకున్ వెడ నమ్మకాలకున్.

పుట్టించెం దయలేని లోకమున నే పుణ్యాత్ముడో కుక్షిలో
ముట్టించెం బొగలేని యాకటిసొదన్ ముప్పూట లీచిక్కులో
నట్టిట్టై తపియించు నా కొదవు నాహారంబు భక్షింపగా
పుట్టంజొచ్చిరి దేవతల్ బహుళరూపుల్ బుట్టలై చెట్టులై.

అట్టు లెడంద నేర్చెడు మహావ్యధ నాతడు పెళ్ళుగ్రక్కినన్
బిట్టుకదుష్ణబాష్పములు నిండిన కన్నుల సానుభూతి చూ
పెట్టి ప్రదక్షిణించి సురభిక్షకు నింటికి లేచిపోయె గ
న్పట్టె స్వతంత్రభారత విభాకర బాలుడు తూర్పు డోలికన్.

మునిపక్షి రాకపోకల
ఘనసందేశముల కతన ఖర్చయిపోయెన్
దనురక్త మా దరిద్రుఁడు
చనిపోవునొ తత్ఫలంబు జవిజూచెడినో!



# కవి జీవిత పరిచయము

జాషువ గుఱ్ఱం వీరయ్య-లింగమాంబలకు 1895, సెప్టెంబరు 28న వినుకొండలో జన్మించారు. అస్పృశ్యత, దారిద్ర్యం వెంట తరుముతున్నా, సాహితీ క్షేత్రమందు కృషీవలుడు కావలెనన్న కాంక్షతో ఆనాటి అననుకూల వాతావరణాన్ని, సానుభూతి కేర్పడిన దుర్భిక్షాన్ని ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కృషితో "నాస్తి దుర్భిక్షం" నానుడి యదార్థమైంది. అనావృష్టులు, గాలివానలు గతస్మృతులైనాయి. కవితాసుక్షేత్రంలో పసిడినే పండించారు.

ప్రాథమికోపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, నాటి మూకీ చిత్రాలకు వ్యాఖ్యాతగా ఊరూర తిరిగి, వీరేశలింగం. చిలకమర్తుల ఆశీర్వాదాలు పొంది కావ్యజగత్తులో స్థిరపడ్డారు. తిరుపతి వేంకట కవుల ప్రోత్సాహం ముందుకు నడిపింది.

ఉభయ భాషా ప్రవీణులై తెలుగు పండితునిగా, ద్వితీయ ప్రపంచసంగ్రామసమయంలో యుద్ధప్రచారకునిగా, స్వాతంత్ర్యానంతరం 1956 నుంచి 1960 వరకూ ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసరుగా ఉద్యోగాలు నిర్వహించారు.

కవితాభిమానులు, సాహితీసంస్థలచే వేయికిపైగా సన్మానాలు పొందారు. కవి కోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి, విశ్వ కవి సామ్రాట్ అను బిరుదము పొందారు. గండ పెండారము ధరించి కనకాభిషేకాలు పొంది, గజా రోహణము చేసి, పగటి దివిటీల పల్లకిలో నూరేగారు. గుంటూరుజాపట్టణం స్వేచ్ఛా పౌరసత్వ మిచ్చి గౌరవించింది. కేంద్ర సాహిత్య అకాడమీ "క్రీస్తుచరిత్ర" కావ్యమునకు అవార్డు బహూకరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనమండలి సభ్యునిగా నియమించింది ఆంధ్ర విశ్వ విద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదాంకితుని చేసింది. రాష్ట్రపతి "పద్మభూషణ" బిరుదమిచ్చి సత్కరించారు. ముప్పదికి పైగా రచనలుచేసి 1971 జూలై 24న కీర్తిశేషులైనారు.

GABBILAMU by Gurram Joshua

Rs. 10-00

హేమలతా లవణం

పటమట, విజయవాడ-520 006